TGTEL/25/A0827

# ప్రజా దివాన్

తెలుగు దినపత్రిక

prajadivvs57@gmail.com

విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ ... ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా.. ? బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా ... ? అయితే రండి ... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

సెల్ : 9000281049

నియోజకవర్గ ఇంచార్జ్‌లు, జిల్లా స్టాఫర్‌లు మండల రిపోర్టల్‌లు కావలెను...

సంపుటి : 3 సంచిక : 245 | గురువారం 27-08-2026 | ఎడిటర్: ఎస్ ఎన్ మౌనిక | పేజీలు : 8 వెల 3 /-

## సీజేపీ నిరసనల తర్వాత..

### ఇన్‌స్టాలో పెరిగిన మోదీ, రాహుల్ క్రేజ్

దిల్లీలో ఇటీవల జరిగిన కాక్రోచ్ జనతా పార్టీ నిరసన అనంతరం జెన్‌జీకి దగ్గరకావడానికి కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంది. విద్యార్థులను ఉద్దేశించి ప్రధాని మోదీ ఇన్‌స్టాగ్రామ్‌లో పలు వీడియోలు షేర్ చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సైతం 'ఆస్క్ మీ ఎనీథింగ్' సెషన్‌లలో పాల్గొన్నారు. విద్యార్థులతో మాట్లాడిన వీడియోలను ఇన్‌స్టాలో పోస్ట్ చేశారు. పలువురు కేంద్రమంత్రులు కూడా యువతతో మమేకమవ్వడానికి





2లో

## 'ఆ పరీక్ష ప్రశ్నపత్రాన్ని రూ.40 లక్షలకు అమ్మేశారు'..!

డ్రగ్ ఇన్‌స్పెక్టర్ గ్రూప్-బి పోస్టుల నియామక ప్రక్రియను మహారాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్‌రద్దు చేసింది. ఈ ఏడాది మార్చిలో నిర్వహించిన పరీక్షలో అవకతవకలు జరిగాయనే ఆరోపణలపై ప్రాథమిక విచారణ అనంతరం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. మరోవైపు.. ఈ పరీక్ష ప్రశ్నపత్రాన్ని రూ.40 లక్షల చొప్పున అమ్మేశారని ప్రతిపక్ష ఎన్సీపీ (ఎస్పీ) ఎమ్మెల్యే రో

పేజీ 2లో



# నాగార్జునసాగర్‌లో మళ్లీ జల వివాదం..

## బోర్డు అనుమతి లేకుండా ఏపీ నీటి విడుదల

- నాగార్జునసాగర్ వద్ద మరోసారి జల వివాదం
- ఏపీకి 10 టీఎంసీలు, తెలంగాణకు 15 టీఎంసీలు
- ఏపీ వాటా నీరు ఇప్పటికే పూర్తి వినియోగం
- అనుమతి లేకుండా 1,600 క్యూసెక్కుల విడుదల ఆరోపణ
- తెలంగాణ వాటాలో ఇంకా నీరు మిగిలి ఉంది
- తెలంగాణ 1,000 క్యూసెక్కుల నీరు విడుదల
- ఏపీ తీరుపై తెలంగాణ అధికారుల అభ్యంతరం







నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ దగ్గర మరోసారి జల వివాదం తెరపైకి వచ్చింది. ఇరు రాష్ట్రాల మధ్య నీటి కేటాయింపులు, వినియోగంపై ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మే నెలలో కృష్ణా నృష్ణా బోర్డు (ఖ=వీదీ) సమావేశంలో ఇరు రాష్ట్రాలకు నీటిని కేటాయించారు. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు 10 టీఎంసీలు, తెలంగాణకు 15 టీఎంసీల నీటిని కేటాయించారు. అయితే ఏపీ తనకు కేటాయించిన 10 టీఎంసీల నీటిని ఇప్పటికే పూర్తిగా వినియోగించుకుంది.
ఈ తరుణంలో కృష్ణా నృష్ణా బోర్డు (ఖ=వీదీ) ఎలాంటి అధికారిక అనుమతులు ఇవ్వకపోయినప్పటికీ, ఏపీ ఇరిగేషన్ , జెన్‌కో అధికారులు ఏకపక్షంగా వ్యవహరించారనే ఆరోపణలు వస్తున్నాయి. కుడి కాలువ పవర్‌హౌస్ ద్వారా ఏకంగా 1600 క్యూసెక్కుల నీటిని ఏపీ అధికారులు విడుదల చేశారు. మరోవైపు, తెలంగాణకు ఇంకా నీటి వాటా మిగిలి ఉండటంతో.. స్థానిక ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని తెలంగాణ ఇరిగేషన్ అధికారులు అప్రమత్తమయ్యారు. తెలంగాణ వాటాలో భాగంగా ఎడమ కాలువ ద్వారా 1000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.నిబంధనలకు విరుద్ధంగా, బోర్డు అనుమతి లేకుండా ఏపీ నీటిని విడుదల

## ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ కార్యక్రమాన్ని అడ్డుకుంటామన్న న్యూయార్క్ మేయర్‌పై కిషన్‌రెడ్డి మండిపాటు

### మోహన్ భగవత్ కార్యక్రమంపై వివాదం

- 29న మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో కార్యక్రమం
- అడ్డుకుంటామని మమ్దానీ ప్రకటన
- మమ్దానీపై కిషన్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం
- ప్రకటన భారత్ వ్యతిరేకతకు నిదర్శనమని విమర్శ
- ఓటు బ్యాంకు రాజకీయాల కోసమేనని ఆరోపణ



దిల్లీ: ఈనెల 29వ తేదీన అమెరికాలోని మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో జరగబోయే ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ కార్యక్రమాన్ని అడ్డుకుంటామని న్యూయార్క్ మేయర్ జోహ్రాన్ మమ్దానీ చేసిన ప్రకటన పట్ల కేంద్ర మంతి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. "భారతీయులనుద్దేశించి మోహన్ భగవత్ ప్రసంగించబోయే కార్యక్రమాన్ని వ్యతిరేకిస్తున్నట్లు జోహ్రాన్ మమ్దానీ చేసిన ప్రకటన ఆయన భారత వ్యతిరేకతకు అద్దంపడుతోంది. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం, భారత్‌లోని ప్రజాస్వామ్యాన్ని వ్యతిరేకించే అసాంఘిక శక్తుల మెప్పు పొందేందుకు మోహన్ భగవత్ కార్యక్రమాలను అడ్డుకోవాలని అక్కడి మేయర్ నిర్ణయించారు. సమ్మిళిత సాంస్కృతిక సమావేశాలపై ఉద్దేశపూర్వకంగా దాడి చేస్తున్నారు. సాంస్కృతిక మూలాలు, వారసత్వాన్ని చూసి గర్వపడే భారతీయ అమెరికన్లు, ప్రవాస భారతీయులపట్ల మమ్దానీకున్న అసహనాన్ని ఈ ప్రకటన బహిర్గతం చేస్తోంది. ప్రజాస్వామ్య విలువలు, వసుధైక కుటుంబక సిద్ధాంతాన్ని పాటించే భారత్‌కు విద్వేషాలు, విభజనను ఆయుధంగా వాడుకొనే ఇలాంటి వారి నీతులు అవసరం లేదు" అని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. ఈమేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## ప్రపంచస్థాయిలో అమరావతి నిర్మాణం: నాదెండ్ల మనోహర్

### శాసనసభ భవన రూపకల్పనపై నార్మన్ ఫోస్టర్స్ బృందంతో చర్చలు

- డీలిమిటేషన్ దృష్టిలో ఉంచుకుని దీర్ఘకాలిక డిజైన్లు
- సందర్శకుల కోసం ప్రత్యేక ఎక్స్‌పీరియన్స్ సెంటర్
- పచ్చదనం, అండర్‌గ్రౌండ్ పార్కింగ్‌తో ఆధునిక ప్రాంగణం



పేజీ 2లో

**అమరావతి, ఆగష్టు 26 :** ప్రపంచంలోనే అద్భుతమైన రాజధానిగా అమరావతిని నిర్మించడమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యమని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. సచివాలయంలో అంతర్జాతీయ ఆర్కిటెక్చర్ సంస్థ నార్మన్ ఫోస్టర్స్ అండ్ పార్టనర్స్ ప్రతినిధులతో ఉన్నతస్థాయి సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. శాసనసభ భవనాన్ని అత్యున్నత ప్రమాణాలు, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు సమగ్రంగా చర్చించినట్లు పేర్కొన్నారు.

**అత్యాధునిక సదుపాయాలు**

శాసనసభ భవనంపై ప్రత్యేక టవర్ ఏర్పాటు చేసి నగరాన్ని వీక్షించేలా రూపకల్పన చేస్తున్నామని తెలిపారు. భవిష్యత్ డీలిమిటేషన్ దృష్టిలో ఉంచుకుని 265 అసెంబ్లీ, 110 కౌన్సిల్ స్థానాలకు సరిపడేలా ఏర్పాట్లు ఉంటాయన్నారు.

## జీసీసీల ఏర్పాటుకు హైదరాబాద్ తొలి ఎంపిక:

### జీసీసీలకు హైదరాబాద్ తొలి ఎంపిక

- గతేడాది 75 జీసీసీలు రాక
- వచ్చే ఏడాది మరో 100 జీసీసీల లక్ష్యం
- హైటెక్ సిటీలో ఆక్టేవ్ కొత్త సెంటర్
- ఐటీతో పాటు పలు రంగాల్లో కంపెనీలు
- ఏఐ, డేటా, క్లౌడ్‌పై ఆక్టేవ్ దృష్టి
- హైదరాబాద్‌లో బలమైన టెక్ ఎకోసిస్టమ్



2లో

## ప్రజల ఆస్తులను రాత్రికి రాత్రే నిషేధిత జాబితాలో పెట్టారు:

- 22ఏలో ప్రజల ఆస్తుల చేర్పు
- ప్రభుత్వమే కబ్జాదారుగా మారింది: హరీశ్‌రావు
- భూముల కేంద్రంగా కాంగ్రెస్ పాలన
- రూ.30 వేల కోట్ల భూముల విక్రయం
- ప్రజల భూములతో ఇబ్బందులు
- అనుచరులకు భూముల కట్టబెట్టారని ఆరోపణ



2లో

## పార్టీ నేత కోరిక.. ఇంటి ఆడబిడ్డగా వధువు మెడలో తాళి కట్టిన కవిత



2లో



## 31న వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభం

- మూడు దశాబ్దాల కల నెరవేరుస్తున్న చంద్రబాబు
- నిర్వాసితుల త్యాగాలకు ప్రభుత్వం పాదాభివందనం
- 40 రోజుల్లోనే నిర్వాసితులకు 768 కోట్లు విడుదల

2లో

## రాష్ట్ర ప్రగతిని అడ్డుకునేందుకు కుట్రలు

- ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర
- ప్రభుత్వంపై జగన్మోహన్ రెడ్డి అసత్య ప్రచారాలు
- అసెంబ్లీకి రాకుండా ప్రెస్ మీట్లతో కాలయాపన
- సాగునీటి ప్రాజెక్టులకు కూటమి ప్రభుత్వంలో భారీ నిధులు
- బీసీల సంక్షేమానికి కట్టుబడిన ప్రస్తుత ప్రభుత్వం



2లో

# సంపాదకీయం

## సైద్ధాంతిక రాజకీయాలు ఏవీ?

'పాతికేళ్ల క్రితం నేను మీ నాన్నను కలుసుకునేందుకు మీ ఇంటికి స్కూటర్‌పై వచ్చాను గుర్తుందా?' అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ గుజరాత్‌కు చెందిన ఒక యువనేతను ఉద్దేశించి అన్నారు. 1991లో మురళీమనోహర్ జోషీతో పాటు ఏక్తా యాత్రకు సహాయంగా వచ్చినప్పుడు 'నీవు ఒక పిల్లవాడిగా మాకు ఫలహారాలు అందించావు' అని ఆయన మరో నేతకు చెప్పారు. '2014లో నేను ప్రధాని కాకముందు హైదరాబాద్ వచ్చినప్పుడు ఎల్బీ స్టేడియంలో యువసమ్మేళనం నీ ఆధ్వర్యంలోనే జరిగింది కదా, అప్పుడు టికెట్ పెట్టినా భారీ ఎత్తున యువత హాజరైంది' అని ఏపీకి చెందిన మరో నాయకుడితో మోదీ అన్నారు. కొత్తగా నియమితులైన బీజేపీ పదాధికారులతో దాదాపు నాలుగు గంటల పాటు మోదీ సమావేశమైనప్పుడు జరిగిన సంభాషణలివి. బీజేపీ పదాధికారులందర్నీ తన చుట్టూ కూర్చోబెట్టుకుని దాదాపు 50 మందితో మాట్లాడనిచ్చిన మోదీ.. మధ్య మధ్యలో వారితో తన అనుబంధాన్ని, గత స్మృతులను నెమరు వేసుకున్నప్పుడు వారు ఆశ్చర్యపోయారు. కొంతమంది అయితే కన్నీరు కార్చారు. 'మోదీ జ్ఞాపకశక్తి అమోఘం' అని ఒక నేత చెప్పారు. 'కొత్త టీమ్ సమావేశం జరుగుతోంది సార్. మీరు వస్తే బాగుంటుంది అని నేనే ప్రధానికి చెప్పాను' అని జాతీయ అధ్యక్షుడు నితీన్ నబీన్ చెప్పారు. 'కెప్టెన్ ఆదేశిస్తే రాకుండా ఎలా ఉంటాను.. మీ అందర్నీ కలుసుకుంటే ఇంట్లో కుటుంబసభ్యుల మధ్య ఉన్నట్లుంటుంది' అని మోదీ నవ్వుతూ చెప్పారు. రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి వసుంధరా రాజే, సిద్ధాంతకర్తగా పేరొందిన రాంమాధవ్, సంస్థాగత ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ తదితర ఉద్దండులు కూడా మోదీ మాట్లాడుతుంటే తదేకంగా వింటూ కూర్చున్నారు. సమావేశం తర్వాత వారందరితో పాటు గ్రూప్ ఫోటో దిగారు. కలిసి భోజనం చేశారు. ఆశ్చర్యకమైన విషయం ఏమంటే, ఈ కీలక సమావేశంలో హోంమంత్రి అమిత్ షా పాల్గొనలేదు. గతంలో జగత్‌ప్రకాశ్ నడ్డా అధ్యక్షుడు అయిన తర్వాత ఆఫీసు బేరర్లను నియమించినప్పుడు మోదీ ఇలాంటి అసాధారణమైన రీతిలో వ్యవహరించలేదు. ప్రధానమంత్రి కార్యాలయానికి వారందర్నీ పిలిపించుకుని గ్రూపుల వారీగా ఫోటోలు దిగి పంపించేశారు. ఈసారి మోదీ తానే పార్టీ కార్యాలయానికి వచ్చి పాల్గొన్న ఈ సమావేశం ద్వారా పంపించిన సందేశం ఏమిటి? అందరి పుట్టుపూర్వోత్తరాల్ని పరిశీలించిన తర్వాతే వారిని తానే ఎంపిక చేశానని, ఇది తన టీమ్ అని మోదీ అప్రకటితంగానే స్పష్టం చేశారు. ప్రభుత్వానికైనా, పార్టీకైనా తానే నాయకుడినని, తానే రెండింటినీ నడిపిస్తానని, రెండో వ్యక్తికి ఆ అవకాశం ఇవ్వనని చెప్పడం కూడా ఆయన ఉద్దేశం కావచ్చు. రానున్న రోజుల్లో వారికి బాధ్యతలు అప్పజెప్పే విషయంలో కూడా తన హస్తం ఉంటుందని ఆయన మాటల్లో పరోక్షంగా వ్యక్తం అయింది. గడచిన కొన్ని రోజులుగా దేశంలో జరుగుతున్న పరిణామాలను దృష్టిలో ఉంచుకుని పరిస్థితిని తన పూర్తి నియంత్రణలోకి తీసుకోవాలని నరేంద్రమోదీ నిర్ణయించినట్లు స్పష్టమవుతోంది. గత కొద్ది రోజులుగా ఆయన ఒక్కో కేంద్ర మంత్రిని పిలుచుకుని సుదీర్ఘంగా మాట్లాడుతున్నారు. త్వరలో మంత్రివర్గంలో భారీ మార్పులకు కూడా ఆయన రంగం సిద్ధం చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

ఇంతకీ.. పార్టీని, ప్రభుత్వాన్ని కొత్త రీతిలో, సైద్ధాంతికంగా పటిష్ఠం చేసే దిశలో మోదీ నడిపించదలుచుకున్నారా అన్నది ప్రశ్న. సైద్ధాంతికంగా ఆయన పార్టీ పదాధికారులకు చెప్పింది ఏమీ లేదు. దేశంలో ప్రస్తుత వివాదాలపై దృష్టి సారించకుండా వికసిత్ భారత్ పైనే ఆలోచించాలని చెప్పారు. ప్రజల్లోకి వెళ్లాలని, యువతను విశ్వాసంలోకి తీసుకోవాలని, నిరాడంబరంగా వ్యవహరించాలని, సోషల్ మీడియాపై దృష్టి సారించాలని ప్రోత్సహించారు. యథాప్రకారం ఆయన తన నాయకత్వాన్నే పార్టీ ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్దేశించారు. సెప్టెంబర్ 17న తన పుట్టిన రోజు సందర్భంగా నెల రోజుల పాటు సేవా సంకల్ప్ అభియాన్ పేరుతో ఉధృతంగా కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. అంతేకాదు, తాను గుజరాత్ ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వేడుకలు జరుపుకోవాలని కూడా ఆయన నిర్ణయించారు.

బీజేపీ, కేంద్ర ప్రభుత్వం వ్యక్తి కేంద్రంగా ఎందుకు మారుతున్నాయి అన్న ప్రశ్నకు జవాబిచ్చే సిద్ధాంతకర్తలెవరూ ఆ పార్టీలో లేరు. పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ మోదీ తనను తాను కథానాయకుడిగా చిత్రించి అందరిలో ఆరాధనాభావం కల్పించాలని భావిస్తున్నట్లు మాత్రం స్పష్టమవుతోంది. పదాధికారుల సమావేశంలో బీజేపీ చేసిన ప్రధాన తీర్మానం వందేమాతర గీతం గౌరవాన్ని పరిరక్షించాలని నిర్ణయం తీసుకోవడం. వందేమాతర గీతాన్ని రెండు చరణాలు మాత్రమే పాడాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీసుకున్న నిర్ణయాన్ని బీజేపీ పదాధికారుల సమావేశం తీవ్రంగా ఖండించింది.

అసలు వందేమాతర గీతం పూర్తిగా పాడాలనడం దేశంలో జనాన్ని కదిలించి బీజేపీ ఆశిస్తున్న సాంస్కృతిక జాతీయవాదానికి దారి తీస్తుందా అన్నది చర్చనీయాంశం. ప్రజల్లో, ప్రధానంగా నేటి జెన్‌జీ లో వందేమాతరం రెండు చరణాలకు పరిమితం కాకుండా పూర్తిగా పాడాలని చట్టం చేయడం ఎంత భావోద్వేగాన్ని కలిగిస్తుందనేది కూడా అంచనా వేయవలిసి ఉన్నది. చట్టం ద్వారా జాతీయ ఐక్యతను సాధించగలమా? అయినప్పటికీ ఇది బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్య ఒక సైద్ధాంతిక వ్యత్యాసాన్ని స్పష్టం చేస్తుందనడంలో సందేహం లేదు. కానీ నిజంగా ఈ రెండు పార్టీలు ఈ సైద్ధాంతిక దృక్పథంలో లోతుగా ఆలోచించి నిజాయితీగా పనిచేస్తున్నాయా అన్నది కూడా ఆలోచించాల్సి ఉన్నది.

భారతీయ జనతా పార్టీకి సంబంధించి ఇది పోటీ పరీక్షల పత్రాల లీకేజీలు, విద్యార్థుల ఆందోళనలు, అయోధ్యలోని రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టులోని ఆర్థిక అవకతవకల నుంచి దృష్టి మళ్లించడానికి ఉపయోగపడుతుందని వారు భావించవచ్చు. కానీ ఈ అంశాలను సజీవంగా ఉంచేందుకు కాంగ్రెస్ తీవ్రంగా యత్నిస్తోంది. విద్యార్థుల మీద హింసాకాండపై సుప్రీంకోర్టును కవచంగా ఉపయోగించుకుని ప్రభుత్వం సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఒకరి నేతృత్వంలోని కమిటీ ద్వారా సమస్య తీవ్రతను చల్లార్చేందుకు ప్రయత్నిస్తుంటే, పెల్లెట్ల ప్రయోగంపై ఎఫ్ఐఆర్ ఎందుకు దాఖలు చేయలేదని కాంగ్రెస్ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ పోలీస్ స్టేషన్‌లో హంగామా సృష్టించారు. అయోధ్య సంఘటనపై విమర్శలను ఎదుర్కొనేందుకు బీజేపీ వందేమాతర గీతం పూర్తిగా పాడాలంటూ చట్టం చేస్తే యూపీ కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్ రాయ్ నేరుగా అయోధ్యకు వెళ్లి హనుమాన్ ఘడీ వద్ద హనుమాన్ చాలీసా పఠించారు. మరోవైపు రాహుల్‌గాంధీ పూణేలో బీజేపీ మనువాద దృక్పథంతో వ్యవహరిస్తోందని విమర్శించారు.

కాంగ్రెస్ జాతీయవాదాన్ని, దేశభక్తిని ప్రశ్నార్థకంగా మార్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తుంటే, కమలనాథులను నేటి యువతరానికి, సామాజిక న్యాయానికి వ్యతిరేకంగా చిత్రించేందుకు కాంగ్రెస్ శతవిధాలా ప్రయత్నిస్తోంది. కానీ రెండు పార్టీలకు జాతీయవాదం పట్ల స్పష్టత ఎంత ఉన్నదనేది చర్చనీయాంశం. నెహ్రూ రూపొందించుకున్న ఉదారవాద జాతీయవాదాన్ని సైద్ధాంతికంగా ప్రజల్లోకి తీసుకువెళ్లడంలో కాంగ్రెస్ ఎంతవరకు విజయవంతం అయింది? భారతదేశ గుర్తింపు మతపరమైన సిద్ధాంతంపై కాకుండా సాంస్కృతిక బహుళత్వంపై ఆధారపడి ఉంటుందని విశ్వసించిన నెహ్రూ భావజాలాన్ని కాలానుగుణంగా అన్వయించడంలో కాంగ్రెస్ విఫలమైందన్న విషయం విస్పష్టం. అదే సమయంలో సాంస్కృతిక జాతీయవాదాన్ని, సమగ్ర మానవతావాదాన్ని ప్రతిపాదించిన దీనదయాళ్ ఉపాధ్యాయ సిద్ధాంతానికి దూరంగా బీజేపీ పయనించడం ప్రారంభించి చాలా కాలమైంది. పూర్తి స్థాయి కార్పొరేటీకరణ, విదేశీ ఆర్థిక విధానాలకు భిన్నంగా స్వదేశీ ఆర్థిక సిద్ధాంతాన్ని రూపొందించుకోవాలని, కేంద్రీకృత పాలనను కాకుండా అన్నిస్థాయిల్లో వికేంద్రీకరణ జరపాలని, పొదుపుగా, నిరాడంబరంగా జీవిస్తూ రాజకీయాలను సేవగా మాత్రమే భావించాలని ఆయన చేసిన సూచనలను ఎంతమంది పాటిస్తున్నారు? ఈ రెండు పార్టీలూ ఎన్నికల రాజకీయాలకు అనుగుణంగా పావులు కదుపుతున్నాయే కానీ, తమ పార్టీల్లో సైద్ధాంతిక స్పష్టత కల్పించాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్న దాఖలాలు కనపడడం లేదు. యూపీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మనుస్మృతిని, కులగణనను లేవనెత్తేందుకు రాహుల్ యత్నిస్తుండవచ్చు. తద్వారా బహుజనులు, ఓబీసీల ఓట్లను కాంగ్రెస్ సాధించగలదా అన్నది ప్రశ్నార్థకం. బిహార్ ఎన్నికలకు ముందు కులగణనను ప్రధానాంశంగా చేసినప్పటికీ కాంగ్రెస్ తగిన సీట్లను సాధించలేకపోయింది.

## రాష్ట్ర ప్రగతిని అడ్డుకునేందుకు కుట్రలు

మొదటిపేజీ తరువాయి

**మంగళగిరి, ఆగష్టు 26 :**
రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులపై జగన్మోహన్ రెడ్డి ప్రెస్‌మీట్లు పెట్టి అభూత కల్పనలు, అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. విపత్తులను ఎదుర్కొనే దూరదృష్టి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి మాత్రమే ఉందని స్పష్టం చేశారు. ఎల్ నినో, వర్షాభావ పరిస్థితులపై అసెంబ్లీలో చర్చ పెడితే వైసీపీ ఎమ్మెల్యేలు ముఖం చాటేశారని విమర్శించారు. గత ఐదేళ్ల పాలనలో రైతాంగానికి తీరని నష్టం వాటిల్లినా నాటి ప్రభుత్వం పట్టించుకోలేదని మండిపడ్డారు.

సాగునీటి రంగానికి ఊతం

గతంలో నిలిచిపోయిన సాగునీటి ప్రాజెక్టులను కూటమి ప్రభుత్వం వేగవంతం చేస్తోందని తెలిపారు. రాయలసీమ ప్రాజెక్టులకు దాదాపు 13,500 కోట్లు కేటాయించామని, హంద్రీ-నీవా, పట్టిసీమ, వెలిగొండ పనులను వేగవంతం చేసి రైతులకు నీరందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో 36 ప్రాధాన్యతా ప్రాజెక్టులను 2029 నాటికి పూర్తి చేయడమే లక్ష్యమని స్పష్టం చేశారు.

బీసీల సంక్షేమానికి ప్రాధాన్యం

వైసీపీ పాలనలో బీసీ రిజర్వేషన్లను తగ్గించి అన్యాయం చేశారని, కూటమి ప్రభుత్వం రాజ్యసభ స్థానాల్లో 50 శాతం బీసీలకే ఇచ్చి గౌరవించిందని తెలిపారు. 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ ప్రక్రియను చేపట్టి ఎన్నికల హామీలను నిలబెట్టుకున్నామని తెలిపారు. అసత్య ప్రచారాలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని ఆయన హెచ్చరించారు.

## ప్రపంచస్థాయిలో అమరావతి నిర్మాణం: నాదెండ్ల మనోహర్

మొదటిపేజీ తరువాయి

గవర్నర్ ప్రసంగానికి ఉభయ సభలు కలిసేందుకు సెంట్రల్ హాల్, శాసన ప్రక్రియపై అవగాహన కోసం ఎక్స్‌పీరియన్స్ సెంటర్ నిర్మిస్తున్నట్లు వివరించారు.



పర్యావరణ హిత ప్రాంగణం

ప్రాంగణమంతా ఆహ్లాదకరంగా ఉండేలా అండర్‌గ్రౌండ్ పార్కింగ్ ఏర్పాటు చేసి, పైభాగంలో పచ్చదనంతో కూడిన గార్డెన్‌ను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి సూచించారని తెలిపారు. ప్రజాప్రతినిధులకు మెరుగైన వసతులు, అత్యాధునిక సాంకేతికతతో కూడిన ప్రపంచస్థాయి శాసనసభ భవనాన్ని ప్రభుత్వం తీర్చిదిద్దుతోందని స్పష్టం చేశారు.

## ప్రజల ఆస్తులను రాత్రికి రాత్రే నిషేధిత జాబితాలో పెట్టారు:

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: ప్రజల ఆస్తులను రాత్రికి రాత్రే నిషేధిత జాబితాలో పెట్టారని, ప్రభుత్వమే ప్రజల ఆస్తుల పాలిట కబ్జాదారుగా మారిందని మాజీ మంత్రి హరీశ్‌రావు (ఝతీఅంష్ర్త తీఝశీ) విమర్శించారు. హైదరాబాద్ కూకట్‌పల్లిలో 22ఏ నిషేధిత భూముల బాధితులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడారు.

"గతంలో కేసీఆర్.. ప్రజలు కేంద్రంగా పాలన సాగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం భూములు కేంద్రంగా పాలన సాగిస్తోంది. కేసీఆర్ సీఎం కాగానే.. ముందుగా ప్రజల సమస్యలపై దృష్టి సారించారు. తాగునీరు, విద్యుత్, హైదరాబాద్‌లో ట్రాఫిక్ వంటి సమస్యలపై దృష్టిపెట్టి పరిష్కరించారు. ప్రాజెక్టుల నిర్మాణంతో వరి దిగుబడిలో పంజాబ్‌ను అధిగమించి తెలంగాణ నంబర్‌వన్‌గా నిలిచింది. కేసీఆర్ ప్రతి ఆలోచన పేదల సంక్షేమం కోణంలోనే చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఎక్కడ భూములున్నా.. వెంటనే అమ్మేస్తోంది. రెండున్నరేళ్లలో రూ.30వేల కోట్ల విలువైన భూములు అమ్మారు. భవిష్యత్‌లో ప్రభుత్వ అవసరాలకు కూడా లేకుండా భూములు అమ్ముతున్నారు. ఇప్పుడు ప్రజల భూములను కూడా 22ఏలో చేర్చి ఇబ్బందిపెడుతున్నారు. ప్రజల నుంచి భూములు సేకరించి తన అనుచరులకు కట్టబెడుతున్నారు"అని ఆరోపించారు.

## జీసీసీల ఏర్పాటుకు హైదరాబాద్ తొలి ఎంపిక:

మొదటిపేజీ తరువాయి

మాదాపూర్: ప్రపంచస్థాయి కంపెనీలు గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ) ఏర్పాటుకు తొలి ఎంపికగా హైదరాబాద్‌ను ఎంచుకుంటున్నాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. గతేడాది రాష్ట్రంలోకి 75 జీసీసీలు వచ్చాయన్నారు. వచ్చే ఏడాది నాటికి మరో 100 సెంటర్లను తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. ఆక్టేవ్ ఇంటెలిజెన్స్ సంస్థ హైటెక్ సిటీలో కొత్తగా ఏర్పాటు చేసిన గ్లోబల్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ సెంటర్‌ను బుధవారం మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించి మాట్లాడారు. నగరంలో కేవలం ఐటీ మాత్రమే కాకుండా స్పోర్ట్స్ టెక్నాలజీ, మీడియా, హాస్పిటాలిటీ, క్యాపిటల్ మార్కెట్స్, ట్రేడింగ్, ఎనర్జీ వంటి విభిన్న రంగాలకు చెందిన కంపెనీలు ఏర్పాటు అవుతున్నాయన్నారు.

ఆక్టేవ్ సీఈవో మటియాస్ స్టెన్‌బర్గ్ మాట్లాడుతూ.. తమ సంస్థ తదుపరి వృద్ధి దశను కొనసాగించడానికి హైదరాబాద్ అన్నివిధాలా అనువైన ప్రదేశం అన్నారు. ప్రపంచస్థాయి ఇంజినీరింగ్ ప్రతిభ, శక్తివంతమైన టెక్నాలజీ ఎకో సిస్టమ్, బలమైన ఆవిష్కరణల సంస్కృతి.. హైదరాబాద్ సొంతమన్నారు. ఆక్టేవ్ ఇండియా ప్రొడక్ట్ అండ్ సర్వీసెస్ వైస్ ప్రెసిడెంట్ శేఖర్ కొనిదెన మాట్లాడుతూ.. ఇన్నోవేషన్ సెంటర్ కేంద్రంగా సాఫ్ట్‌వేర్, ఏఐ, డేటా, క్లౌడ్, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ అంశాల్లో సేవలు, ఆవిష్కరణలు ఉంటాయన్నారు

## ఏడు రైలు మార్గాలు.. నాలుగు లైన్లుగా విస్తరణ: అశ్వినీ వైష్ణవ్

దేశంలో రద్దీ ఎక్కువగా ఉండే ఏడు కీలక రైలు మార్గాల అభివృద్ధిపై కేంద్రం దృష్టి సారించింది. ఈ మార్గాలను నాలుగు లైన్లుగా విస్తరిస్తున్నట్లు రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు. దీనికి సంబంధించి 'ఎక్స్' వేదికగా ఆయన వివరాలు వెల్లడించారు. భవిష్యత్తులో పెరగనున్న ప్యాసింజర్, సరకు రవాణా డిమాండ్‌ను నెరవేర్చేందుకు, తక్కువ ట్రాన్స్‌పోర్ట్ వ్యయం, పర్యావరణహితమైన రైల్వే వ్యవస్థ ఏర్పాటుకు ఈ విస్తరణ కీలకమని పేర్కొన్నారు.

"దిల్లీ-హౌవ్‌డా, హౌవ్‌డా-చెన్నై, చెన్నై-ముంబయి, ముంబయి-దిల్లీ, దిల్లీ-చెన్నై, ముంబయి-హౌవ్‌డా, దిల్లీ-గువాహటి.. ఈ ఏడు రైలు మార్గాలు హైడెన్సిటీ నెట్‌వర్క్‌లో భాగం. ఇవి 11 వేల కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నాయి. దేశ రైల్వే నెట్‌వర్క్‌లో వీటి వాటా 16 శాతంగానే ఉన్నప్పటికీ.. మొత్తం రైల్వే ట్రాఫిక్‌లో 41 శాతం రాకపోకలు ఈ మార్గాల్లోనే సాగుతున్నాయి. ఈ మార్గాల్లో ఇప్పటికే కొన్ని చోట్ల నాలుగు లైన్లు ఉన్నాయి. మొత్తం నెట్‌వర్క్‌ను నాలుగు లైన్లుగా విస్తరించడం ద్వారా ప్రయాణికులు, సరకు రవాణా సామర్థ్యం పెంపు సాధ్యమవుతుంది" అని అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు.

## సీజేపీ నిరసనల తర్వాత..

మొదటిపేజీ తరువాయి

దీని ఫలితం ఇన్‌స్టాగ్రామ్ లో కనిపించినట్లు 'డేటా బిగిన్స్' అనే సంస్థ నివేదికలు వెల్లడించాయి. ఈ సమయంలో ప్రధాని మోదీ, రాహుల్ గాంధీల ఇన్‌స్టా ఎంగేజ్‌మెంట్ రేట్స్ భారీగా పెరిగినట్లు తెలిపాయి. నిరసనలకు ముందు.. జులై 20 తర్వాత గణాంకాలను క్రోడీకరించి ఈ డేటాను వెలువరించాయి.

నివేదికల ప్రకారం.. ఇన్‌స్టాగ్రామ్‌లో మోదీ ఎంగేజ్‌మెంట్ రేట్ (అత్యధిక వ్యూస్, లైక్స్, షేర్స్, కామెంట్స్) 289.9శాతం పెరిగింది. ఆయన తర్వాతి స్థానంలో 180.7శాతంతో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిలిచారు. నిర్ణీత సమయంలో వీరు వరుసగా వీడియోలు షేర్ చేయడంతో అగ్ర నేతల ఖాతాలకు ఆదరణ బాగా పెరిగినట్లు తెలుస్తోంది. వీరితో పాటు వీరి పార్టీ ఖాతాల వ్యూస్ సైతం పెరగడం గమనార్హం.

ఈ నిర్ణీత కాలంలో ప్రధాని నరేంద్ర మోదీ ఖాతాను ఎక్కువ మంది వీక్షించారు. దీంతో ఆయన ఒక్కో పోస్టుకు ఎంగేజ్‌మెంట్ 1,190,000 నుంచి 4,630,000లకు పెరిగింది. మునుపటి స్థాయి కంటే ఇది దాదాపు 3.9 రెట్లు ఎక్కువ. రాహుల్ గాంధీ ఖాతా వీక్షణల్లోనూ గణనీయమైన పెరుగుదల కనిపించింది. ఆయన సగటు ఎంగేజ్‌మెంట్ (×అర్ఘుస్త్రతీఝఎ వఅస్త్రుఝస్త్రవఎవత్) 1,52,000 నుంచి 4,26,000లకు పెరిగింది. యువతను ఆకట్టుకోవడానికి, రాజకీయ దృష్టిని ఆకర్షించడానికి ఇన్‌స్టాగ్రామ్ ప్రధాన సోషల్ మీడియా వేదికగా కొనసాగుతోంది.

## 'ఆ పరీక్ష ప్రశ్నపత్రాన్ని రూ.40 లక్షలకు అమ్మేశారు'..!

మొదటిపేజీ తరువాయి

"రాష్ట్రవ్యాప్త ఏజెంట్ల నెట్‌వర్క్ ద్వారా ఒక్కో ప్రశ్నపత్రాన్ని రూ.40 లక్షలకు అమ్మేసినట్లు నాకు సమాచారం అందింది. ఈ విషయం కమిషన్‌కూ తెలుసు. కానీ.. ఒక్క అభ్యర్థికే ఆ ప్రశ్నపత్రం అందినట్లు చెబుతోంది. ఇది కమిషన్ విశ్వసనీయతకు సంబంధించిన అంశం. కమిషన్ ఛైర్మన్ నైతిక బాధ్యత వహించి వెంటనే రాజీనామా చేయాలి" అని రోహిత్ పవార్ డిమాండ్ చేశారు. మరోవైపు.. ఈ వ్యవహారంపై తాను సీఎం దేవేంద్ర ఫడణవీస్‌ను కలిశానని భాజపా ఎమ్మెల్యే అభిమన్యు పవార్ తెలిపారు. ప్రశ్నపత్రం లీక్‌ను సీఎం తీవ్రంగా పరిగణించారని, సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని చెప్పారు.

పరీక్ష నిర్వహణకు ముందే ఒక అభ్యర్థికి ప్రశ్నపత్రం అందినట్లు పోలీసు విచారణలో ప్రాథమికంగా తేలిందని అంతకుముందు ఎంపీఎస్సీ వెల్లడించింది. ఈ అంశం తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న అనంతరం నియామక ప్రక్రియను రద్దు చేయాలని నిర్ణయించినట్లు తెలిపింది. ఈ పరీక్ష రద్దు.. పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్న అభ్యర్థులకు దక్కిన విజయంగా కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత విజయ్ వడెట్టీవార్ పేర్కొన్నారు.

## జనవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని'

మొదటిపేజీ తరువాయి

**కుప్పం, చిత్తూరు ఫలితాలు**



కుప్పం, చిత్తూరు జిల్లాల్లో ప్రాజెక్టు అమలుతో అద్భుత ఫలితాలు వచ్చాయని అధికారులు సమీక్షలో వివరించారు. చిత్తూరులో హైపర్‌టెన్షన్ నియంత్రణ 56 శాతం, డయాబెటిస్ తీవ్రత 16 శాతం తగ్గాయని తెలిపారు. ప్రాథమిక వైద్య సేవల వినియోగం గణనీయంగా పెరిగిందని, సర్వేలో పాల్గొన్న 91 శాతం మంది ప్రజలు తమ ఆరోగ్యంపై అవగాహన పెరిగిందని తెలిపినట్లు పేర్కొన్నారు.

**ఏఐ ఆధారిత సేవలు**

స్క్రీనింగ్ నుంచి చికిత్స, ఫాలోఅప్ వరకు పూర్తిస్థాయి ఏఐ ఆధారిత ఆరోగ్య వ్యవస్థను రూపొందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ముందస్తు వ్యాధి గుర్తింపు, నివారణ, తక్కువ ఖర్చుతో కూడిన మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని తెలిపారు. ఈ సమీక్షలో మంత్రి సత్యకుమార్ యాదవ్, వైద్యారోగ్య శాఖ కార్యదర్శి వీరపాండియన్, అధికారులు పాల్గొన్నారు.

## 31న వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభం

మొదటిపేజీ తరువాయి

**మార్కాపురం, ఆగష్టు 26 :**
ఈ నెల 31న మూడు దశాబ్దాల వెలిగొండ ప్రాజెక్టు కల సాకారం కాబోతోందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దీనిని ప్రారంభించనున్నారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. మంగళవారం రాత్రి ఆయన ఫీడర్ కెనాల్ రెగ్యులేటర్ గేట్ల పనులతో పాటు ముఖ్యమంత్రి జలహారతి ఇచ్చే ఘాట్, సభా స్థలి ఏర్పాట్లను పరిశీలించారు. నిర్వాసితుల కాలనీలను సందర్శించి మౌలిక వసతులపై కలెక్టర్, అధికారులకు సూచనలు చేశారు. 7 వేల నిర్వాసిత కుటుంబాల త్యాగఫలితంగానే లక్షలాది ఎకరాలకు సాగునీరు, తాగునీరు అందుతోందని ఆయన కొనియాడారు.

నిర్వాసితులకు అండగా ప్రభుత్వం

గత ప్రభుత్వం ఐదేళ్లలో నిర్వాసితులకు ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా మోసం చేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 40 రోజుల్లోనే 768 కోట్లు చెల్లించిందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు పేర్కొన్నారు.

సొంతిళ్లు కట్టించే బాధ్యత

ముంపు గ్రామాల నిర్వాసితులకు రేషన్, పెన్షన్ వంటివి నిరంతరం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. నిర్వాసిత కుటుంబాలు ఇళ్లు కట్టుకుని గృహప్రవేశాలు చేసే వరకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ విజయ సునీత, జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

## పార్టీ నేత కోరిక.. ఇంటి ఆడబిడ్డగా వధువు మెడలో తాళి కట్టిన కవిత

మొదటిపేజీ తరువాయి

కీసర: తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కవిత.. పార్టీ నాయకుడి ఇంటి ఆడబిడ్డగా మారారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర పరిధి చీర్యాలలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన బాలప్రసాద్-శివాని వివాహాన్ని ఆమె చేతుల మీదుగా జరిపించారు. తన ఇంటి ఆడబిడ్డ హోదాలో పెళ్లి చేయాలని బాలప్రసాద్ కోరారు. వారి సామాజికవర్గ ఆచారం ప్రకారం వరుడు వధువుకు తాళి కట్టే ముందు ఆడపడుచు.. పసుపు కొమ్ముతో మూడుముళ్లు వేస్తారు. సంప్రదాయం ప్రకారం కవిత గౌరీ పూజలో పాల్గొని అనంతరం వధువు మెడలో పసుపు కొమ్ముదారంతో మూడుముళ్లు వేశారు. ఒడిబియ్యం పోసి పెళ్లి కుమార్తెను ఆశీర్వదించారు.

ప్రజా దివాన్
తెలుగు దినపత్రిక
27-08-2026

# గూడూరుకు -గుండెకాయ పళ్ళ గుట్ట ను కాపాడుకుందాం

**- గుట్ట పైన గూడూరు ప్రజలు నిరసన**
**- మైనింగ్ పనులు నిలిపివేయాలని డిమాండ్**



ముస్తాబాద్/ ఆగస్టు 26 ప్రజా దివాన్

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం నామాపూర్,గూడూరు గ్రామాల సరిహద్దు పల్లగుట్ట కాంట్రాక్టర్ ల చేతిలో అన్యాక్రాంతం కాకుండా కాపాడుకుందామని గూడూరు గ్రామ ప్రజలు ఏకమై బుధవారం ముక్తకంఠంతో నిరసనలు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ "పల్లగుట్ట" మా గూడూరు గ్రామానికి గుండె లాంటిదని రైతులకు సాగునీరు ప్రజలకు త్రాగునీరు కొరత రాకుండా గుట్టలు కాపాడుతున్నాయని పేర్కొన్నారు. ర్లు,మేకలు,పశువుల మేతకు, ఉపాధి హామీ పనులకు నీటి నిలువల కోసం కాంటూర్ కందగాలను తవ్వించి నీటి నిల్వలకు ఈ గుట్టనే ఆధారమని తెలిపారు. ఈ గుట్టకు ఎన్నో మొక్కలు నాటామని ఇప్పుడు మహా వృక్షాలుగా మారి పెద్ద అడవిలా మారిందన్నారు. బతుకమ్మల కోసం తంగేడు పూలు అందిస్తుందన్నారు. అనంతరం మాజీ సర్పంచ్ చాకలి రమేష్, మాట్లాడారు. మైనింగ్ కోసమని గతంలో2008-2009 సంవత్సరంలో 60 ఎకరాలకు పల్లగుట్ట మైనింగ్ అనుమతి తీసుకున్నామని కాంట్రాక్టర్ ఈ గుట్టను ధ్వంసం చేయాలని చూస్తే,అందుకు నామాపూర్,గూడూరు రెండు గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమం ప్రజా సంఘాల నాయకులతో కలిసి చేపట్టడం తో తన కాంటాక్ట్ పనులు విరమించుకొని వెనక్కి వెళ్లడం జరిగిందని గుర్తు చేశారు. మళ్ళీ ప్రస్తుతం ఏకంగా ఏకంగా జేసీబీతో రోడ్ వేస్తున్నారని తెలిసి కాంట్రాక్టర్ ను అడిగితే మాకు అన్ని విధాలా ప్రభుత్వ మైనింగ్ అనుమతులు ఉన్నాయంటూ మమ్మల్ని బెదిరిస్తున్నాడని వాపోయారు. ఈ గుట్టను తవ్వాలనే ఆలోచన కాంట్రాక్టర్ మానుకోకపోతే ప్రజలు ప్రజా సంఘాల ఏకమై గుట్టలను కాపాడుకుంటామని దౌర్జన్యం చేస్తే భౌతిక దాడులు చేయడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. పచ్చని చెట్లతో ఈ గుట్ట మా గూడూరు గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన గాలిని అందిస్తుందని తద్వారా మేమంతా ఆరోగ్యంగా ఉంటున్నామని తెలిపారు. గుట్టను తవ్వడం మొదలు పెడితే ప్రజలు అనారోగ్యానికి గురవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. గుట్టకు అవతలి వైపు ఉన్న నామాపూర్ లోని రైస్ మిల్లుల నుండి వచ్చే విషవాయువు,బూడిద,ఊకపొట్టు రాకుండా ఈ గుట్ట అడ్డు గోడలా కాలుష్యం నుండి మమ్మల్ని కాపాడుతుందని వెల్లడించారు. తదుపరి మాజీ సర్పంచ్ వెంకట నర్సింగారావు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రం లో తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడు గుట్టను తవ్వడానికి అనుమతి ఇచ్చారన్నారు. కానీ ప్రజల తిరుగుబాటుతో ఉపసంహరించుకున్నారని తెలిపారు. ఇంకుడు గుంతలు,కందకాలు తవ్వించడంతో వర్షాకాలం భూగర్భ జలాలు పెరగడానికి ఈ గుట్ట సత్ఫలితాలు ఇచ్చిందన్నారు. పచ్చగా ఉన్న మా గ్రామాన్ని అంధకారంలోకి నెట్టివేయొద్దని ఈ గుట్టను తవ్వే కార్యక్రమం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ గుట్టను తవ్వడం వలన ఒక్కడికే లాభం కానీ వందల కుటుంబాలు నష్ట పోతాయన్నారు. మాకు 60 ఎకరాలకు అనుమతి ఉన్నా ప్రస్తుతం దాదాపుగా 11 ఎకరాలకు మాత్రమే కుదించి అనుమతి తెచ్చుకున్నామని కాంట్రాక్టర్ చెప్పడం జరిగిందని లెటర్ కూడా గ్రామ పంచాయతీలో ఇచ్చినట్లు తెలిపారన్నారు. ఒక్క అంగుళం కూడా తవ్వడానికి ఒప్పుకోమని గ్రామ ప్రజలతో కలిసి సంబంధిత అధికారులను కలుస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రైతులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# యువత స్వయం ఉపాధితో ముందుకు రావాలి

**- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

వేములవాడ / ఆగస్టు 26 ప్రజాదివాస్





యువత స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు..బుధవారం వేములవాడ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆసుపత్రితో పాటు అడ్వాన్ మెన్స్ వేర్స్ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతలో ప్రతిభ, నైపుణ్యాలు పుష్కలంగా ఉన్నాయని, వాటిని సరైన దిశలో వినియోగించుకుని స్వయం ఉపాధి రంగంలో రాణించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ, ఉపాధి పథకాలను సద్వినియోగం చేసుకుని యువత ఉపాధి అవకాశాలు కల్పించుకోవాలని అన్నారు. వేములవాడ పట్టణంలో నూతనంగా ఆసుపత్రి,వస్త్ర దుకాణం ఏర్పాటు చేయడం అభినందనీయమని, స్థానికులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు మరికొందరికి ఉపాధి అవకాశాలు కల్పించేలా వ్యాపారాలు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు...

# గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి

**- సిరిసిల్ల జిల్లా సిఐటియు జిల్లా కార్యదర్శి కోడం రమణ డిమాండ్**

రాజన్న సిరిసిల్ల జిల్లా / ఆగస్టు 26 ప్రజాదివాస్

గ్రామపంచాయతీ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సిఐటియు రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి కోడం రమణ డిమాండ్ చేశారు. బుధవారం సిఐటియు, తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కార్మికులు సిరిసిల్లలోని అంబేద్కర్ చౌక్ వద్ద నిరసన తెలిపారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి కోడం రమణ, యూనియన్ జిల్లా అధ్యక్షుడు బూర శ్రీనివాస్ మాట్లాడుతూ, గ్రామాల పచ్చదనం, పరిశుభ్రత కోసం కష్టపడి పనిచేస్తున్న పంచాయతీ కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు నెలకు రూ.26,000 కనీస వేతనం చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. అలాగే హెల్త్ కార్డులు, ప్రమాద బీమా సౌకర్యం కల్పించడంతో పాటు ముఖ్యమంత్రి ప్రకటించిన విధంగా ప్రతి నెల 1వ తేదీనే జీతాలు జమ చేయాలని స్పష్టం చేశారు. 60 ఏళ్లు దాటిన, అలాగే మృతి చెందిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక అధికారులు, పాలకవర్గాలు బడ్జెట్ లేదనే సాకుతో కొన్ని గ్రామాల్లో నెలల తరబడి జీతాలు చెల్లించడం లేదని, కార్మికులను ఉద్యోగాల నుంచి తొలగిస్తామని బెదిరింపులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. సమస్యలపై అధికారులు వెంటనే స్పందించకుంటే నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు






ఎగమంటి ఎల్లారెడ్డి, కోశాధికారి అన్నల్దాస్ గణేష్, యూనియన్ జిల్లా కార్యదర్శి మల్యాల నర్సయ్య, నాయకులు లోకిని శ్రీనివాస్, కంసాని రవీందర్, నారపురం నర్సయ్య, మహేష్, శేఖర్, అనిల్, కాంతయ్య, లక్ష్మి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# శాంతి, సౌభ్రాతృత్వంతో పండుగలు నిర్వహించుకోవాలి.

**- మిలాద్-ఉన్-నబి పండుగ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పటిష్ట బందోబస్తు.**
**- ముస్లిం సోదరులకు మిలాద్-ఉన్-నబి పండుగ శు భాకాంక్షలు తెలిపిన జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే.**

రాజన్న సిరిసిల్ల జిల్లా / ఆగస్టు 26 ప్రజాదివాస్



జిల్లా వ్యాప్తంగా మిలాద్-ఉన్-నబి పండుగను పురస్కరించుకుని ముస్లిం సోదరులు నిర్వహించిన ర్యాలీలు శాంతియుత వాతావరణంలో జరిగాయని, జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే తెలిపారు. ఈసందర్భంగా జిల్లా కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొని ముస్లిం సోదరులకు మిలాద్-ఉన్-నబి పండుగ శుభాకాంక్షలు తెలిపి కీర్ పంపిణీ చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ..రాజన్న సిరిసిల్ల జిల్లా మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందని, హిందూ, ముస్లిం సోదరులు భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటుతూ అన్ని పండుగలను పరస్పర సహకారంతో, సోదరభావంతో నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. మిలాద్-ఉన్-నబి వేడుకల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు చేసి ర్యాలీ సజావుగా జరిగేలా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిరంతరం పర్యవేక్షణ చేపట్టామన్నారు.

# రాజన్న ఆలయ గోశాలలో కోడెల మృతి ఘటనపై విచారణ

**కోడెల సంరక్షణలో నిర్లక్ష్యానికి తావులేదు: విప్ ఆది శ్రీనివాస్**

వేములవాడ / ఆగస్టు 26 ప్రజాదివాస్



రాజన్న ఆలయానికి భక్తులు సమర్పించే కోడెలు, ఆవుల సంరక్షణను మరింత పటిష్టం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. బుధవారం గోశాలను సందర్శించిన ఆయన ఇటీవల ఐదు కోడెలు మృతి చెందిన ఘటనపై దేవాదాయ శాఖ అధికారులు, గోశాల నిర్వాహకులు, పశు వైద్యులతో సమీక్ష నిర్వహించారు. కోడెల మృతికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపిస్తామని స్పష్టం చేసిన విప్, మానవ తప్పిదం లేదా అధికారుల నిర్లక్ష్యం తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చిన్న వయసు కోడెలను దూర ప్రాంతాల నుంచి తీసుకురావడం, వాతావరణ మార్పులు, వ్యాధులు వంటి కారణాలతో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని తెలిపారు. భక్తులు పాలు మరవని చిన్న కోడెలను సమర్పించకుండా, కనీసం ఏడాది వయస్సు వచ్చిన తర్వాత సమర్పించాలని సూచించారు. కొత్తగా వచ్చే కోడెలను 15 రోజుల పాటు క్వారంటైన్‌లో ఉంచి, వయస్సు ఆధారంగా వేర్వేరుగా సంరక్షించాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో గోశాలలో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, పచ్చిగడ్డి, పశుగ్రాసం, దాణా నాణ్యతలో రాజీ లేకుండా అందించాలని సూచించారు. కోడెల మధ్య గాయాలు జరగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.










## 40 ఎకరాల్లో ఆధునిక గోశాల

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు వేములవాడలో ఆధునిక సదుపాయాలతో నూతన గోశాల నిర్మాణానికి 40 ఎకరాల భూమిని సేకరించి, క్యాబినెట్ ఆమోదం పొందినట్లు ఆది శ్రీనివాస్ వెల్లడించారు. త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభించి భక్తులకు మెరుగైన గోసేవా సదుపాయాలు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న గోశాల సామర్థ్యాన్ని కూడా పెంచుతున్నామని, భక్తులు సమర్పించే కోడెలు, వృద్ధ ఆవుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. భక్తుల మనోభావాలను గౌరవిస్తూ గోశాల నిర్వహణలో ప్రభుత్వం, దేవాదాయ శాఖ, పశుసంవర్ధక శాఖలు సమన్వయంతో పనిచేస్తాయని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# వేములవాడలో బస్సును ఢీకొట్టిన టిప్పర్: ప్రయాణికులకు తప్పిన ప్రమాదం

**- పలువురికి స్వల్ప గాయాలు**

వేములవాడ / ఆగస్టు 26 ప్రజాదివాస్



వేములవాడ మారుపాక నంది కమాన్ వద్ద గురువారం ప్రమాదం చోటుచేసుకుంది. మెట్ పల్లి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును వెనుక నుంచి వేగంగా వచ్చిన మొరం టిప్పర్ ఢీకొట్టింది. ప్రమాద సమయంలో బస్సులో సుమారు 50 మంది ప్రయాణికులు ఉన్నారు. టిప్పర్ డ్రైవర్ అతివేగం, నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని స్థానికులు చెబుతున్నారు. ఈ ఘటనలో పలువురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో పెద్ద ప్రమాదం తప్పిందని, దీంతో ప్రయాణికులు తీవ్ర దిగ్భ్రాంతికి గురై అనంతరం ఊపిరి పీల్చుకున్నారని తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

## 34వ వర్ధంతి స్మారక ప్రార్థనా కార్యక్రమంలో పాల్గొన్న టి జి ఐ డి సి మాజీ చైర్మన్ మొహమ్మద్ తన్వీర్



ప్రజాదివాస్
జహీరాబాద్ పట్టణంలోని గార్డెన్ నగర్‌లోని ఎం ఆర్ హెచ్ ఎస్ పాఠశాలలో దివంగత రెవ. జార్జ్ బి. గార్డెన్ దొర గారి 34వ వర్ధంతి స్మారక ప్రార్ధనా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ సిద్ధం ఉజ్వల రెడ్డి తెలంగాణ రాష్ట్ర ఇండస్ట్రియల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మొహమ్మద్ తన్వీర్ ముఖ్య అతిథిగా పాల్గొని, దివంగత రెవ. జార్జ్ బి. గార్డెన్ దొర గారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత రెవ. జార్జ్ బి. గార్డెన్ దొర గారు సమాజానికి చేసిన సేవలు, విద్యా మరియు ఆధ్యాత్మిక రంగాల్లో అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ సమాజ అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు, మెమోరియల్ కమిటీ సభ్యులు, మత పెద్దలు, నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

- కొదురుపాక రహదారిపై ప్రమాదకరంగా మారిన వంతెన
- యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించాలి: సీపీఎం డిమాండ్



బోయినిపల్లి మండలం / ఆగస్టు 26 ప్రజాదివాస్
బోయినిపల్లి మండల కేంద్రం నుంచి కొదురుపాక వెళ్లే రహదారిలోని శిథిలావస్థకు చేరిన పాత బ్రిడ్జి స్థానంలో తక్షణమే నూతన వంతెన నిర్మాణం చేపట్టాలని సీపీఎం మండల కమిటీ డిమాండ్ చేసింది. బుధవారం బోయినపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ.. బోయినపల్లి - కొదురుపాక మధ్య ఉన్న బ్రిడ్జి పూర్తిగా దెబ్బతిని ప్రమాదకరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన బ్రిడ్జి నిర్మాణం విషయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు ఏళ్లుగా నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ మార్గంలో ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని వాహనదారులు, గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ ప్రాంత ప్రాతినిధ్యం వహిస్తున్న చొప్పదండి నియోజకవర్గ శాసనసభ్యులు ప్రత్యేక చొరవ తీసుకుని, యుద్ధప్రాతిపదికన నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించాలని కోరారు. నిర్లక్ష్యం వీడి వంతెన నిర్మాణం చేపట్టకపోతే భవిష్యత్తులో ప్రజాసంఘాలు, ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కన్వీనర్ గురిజాల శ్రీధర్, గ్రామస్థులు బొడ్డు రాజలింగం, అంజయ్య, లచ్చయ్య, పార్లపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడలో ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు

- పట్టణంలో ముస్లింల భారీ ర్యాలి
- శాంతి, సౌభ్రాతృత్వాలకు ప్రవక్త బోధనలే ఆదర్శం: మత పెద్దలు

వేములవాడ / ఆగస్టు 26 ప్రజాదివాస్
మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని వేములవాడ పట్టణంలో ముస్లింలు మిలాద్ ఉన్ నబీ వేడుకలను బుధవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో భారీ ర్యాలీ చేపట్టారు. తిప్పాపూర్ వంతెన నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ రెండో బైపాస్ రోడ్డు, సుభాష్‌నగర్, విశాల షాపింగ్ మాల్ మీదుగా కోరుట్ల బస్టాండ్ వరకు సాగింది.ఈ సందర్భంగా మత పెద్దలు మాట్లాడుతూ.. ప్రవక్త మహమ్మద్ బోధించిన శాంతి, కరుణ, సౌభ్రాతృత్వం ప్రపంచ మానవాళికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఆయన చూపిన సన్మార్గంలో నడుస్తూ విశ్వశాంతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.పట్టణ ముస్లిం కమిటీ అధ్యక్షుడు మొహమ్మద్ అక్రమ్ మాట్లాడుతూ.. వేములవాడ గంగా-జమునా తహజీబ్‌కు ప్రతీకగా నిలుస్తోందని, హిందూ-ముస్లింలు ఎల్లప్పుడూ సోదరభావంతో కలిసిమెలిసి ఉంటారని అన్నారు. భవిష్యత్తులోనూ ఇదే ఐక్యమత్యాన్ని కొనసాగించాలని ఆకాంక్షించారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వేములవాడ డీఎస్పీ శ్రీనివాసులు, పట్టణ సీఐ వీరప్రసాద్ పర్యవేక్షణలో పోలీసులు పటిష్ఠ



బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు పీర్ మొహమ్మద్, మసీద్ కమిటీ అధ్యక్షులు నవాబ్ ఖాన్, గౌస్ ఉద్దీన్, మహమ్మద్ ఖయ్యాంతో పాటు పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువతీ యువకులకు ముఖ్య ప్రకటన

ప్రజాదివాస్
అశ్వారావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని నిరుద్యోగ యువతీ యువకులందరికీ ముఖ్య గమనిక భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, ఐపీఎస్ సూచనల మేరకు త్వరలో వెలువడనున్న పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో కానిస్టేబుల్ మరియు ఎస్సై ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల కోసం



ఉచిత శిక్షణ (ఫ్రీ కోచింగ్ ) మరియు ఉచిత వసతి (ఫ్రీ రెసిడెంటిల్ ఫెసిలిటీ ) కల్పించబడును.ఈ సదవకాశాన్ని పొందదలచిన అభ్యర్థులు దరఖాస్తు ఫారమ్‌ను పూర్తిగా నింపి,ఈ నెల 30వ తేదీ సాయంత్రం 5.00 గంటలలోపు అశ్వారావుపేట పోలీస్ స్టేషన్‌లో సమర్పించవలెను.అభ్యర్థులందరికీ సెప్టెంబర్ 6వ తేదీన ప్రవేశ పరీక్ష (ఎంట్రన్స్ టెస్ట్ ) నిర్వహించబడును. ఈ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకుఉచిత శిక్షణతో పాటు ఉచిత రెసిడెన్షియల్ సౌకర్యం కల్పించి, పోలీస్ పోటీ పరీక్షలకు ప్రత్యేకంగా శిక్షణ అందించబడును.కావున, అశ్వారావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని నిరుద్యోగ యువతీ యువకులందరూ ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవలసిందిగా కోరుతున్నాము.

## యూరియా యాప్ తో రైతులకు కష్టాలు తీరేది ఎట్లా

- పాత పద్ధతిలో రైతులకు యూరియా సరఫరా చేయాలి
- కొండూరు రవీందర్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్



ముస్తాబాద్/ఆగస్టు 26 ప్రజా దివాస్
రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాఫ్స్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు హాజరై మాట్లాడారు.యూరియా కోసం రైతులు యాప్ తో రైతులు నానా అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు.యాప్ ద్వారా యూరియా అందుతుందని చెబుతున్న అధికారులు, రైతులు గంటల తరబడి ఫోన్ లతో ప్రయత్నం చేస్తున్నప్పటికి యూరియా బ్యాగులు బుక్ కావడం లేదని ఒక వేళ బుక్ అయినా స్టాక్ లేక రైతులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు.ఫోన్ ఎలా వాడాలో రైతులకు అర్థం కావటంలేదని రైతులు పంట నష్ట పోయి ఆర్థికంగా మానసికంగా ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడుతుందన్నారు.ఈ సమస్య పై వెంటనే రైతులను ఇబ్బంది పెట్టకుండా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి యూరియా కొరత లేకుండా చేయాలని పాత పద్ధతిలోని రైతులకు యూరియా సరఫరా చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి,పార్టీ పట్టణ అధ్యక్షుడు నర్సింహా రెడ్డి, జిల్లా మాజీ కో అప్షన్ సభ్యుడు సర్వర్ పాషా, మాజీ పట్టణ అధ్యక్షులు సంతోష్ రావు,భరత్,మాజీ సర్పంచ్ నర్సయ్య, యూత్ అధ్యక్షుడు స్వామి, నాయకులు కోడె శ్రీనివాస్, గణేష్,ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## సిరిసిల్లలో ఉద్యోగుల మహా ధర్నాకు పిలుపు

రాజన్న సిరిసిల్ల జిల్లా / ఆగస్టు 26 ప్రజాదివాస్
రాష్ట్ర ఉద్యోగుల జేఏసీ పిలుపు మేరకు ఈ నెల 27న నిర్వహించనున్న మహా ధర్నాకు సిరిసిల్ల జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు



పెద్ద సంఖ్యలో తరలిరావాలని ౧+జుజీూజ జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నాకు అనుమతి కోరుతూ జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవన్‌లో నిర్వహించిన సమావేశంలో జిల్లాలోని వివిధ శాఖల ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ౧+ూ, ౧చీ+ూ నాయకులు పాల్గొన్నారు. ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ బిల్లులు,ౢా=జ, బకాయి ఉన్న 6 డీఏలు, హెల్త్ కార్డులు, పాత పెన్షన్ విధానం తదితర సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చేస్తున్న జాప్యాన్ని నిరసిస్తూ దశలవారీగా ఉద్యమాలు చేపట్టాలని రాష్ట్ర ఉద్యోగుల జేఏసీ నిర్ణయించినట్లు నాయకులు తెలిపారు.కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ ఎలుసాని ప్రవీణ్ కుమార్, కన్వీనర్ సయ్యద్ జబీ, డిప్యూటీ జనరల్ సెక్రటరీ గాజుల సుదర్శన్, బి. సాగర్, మొహమ్మద్ రియాజ్, శేఖర్, జీ. శ్రీనివాస్ రావు, సుధాకర్ రెడ్డి, రామనాథ్ రెడ్డి, రాజలింగం, వి. తిరుపతి, మహేందర్ రావు, బి. నారాయణ, జె. రాజు, మొగిలి లక్ష్మణ్, కే. రాజు, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బలరాం తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక అభివృద్ధికి మరో ముందడుగు

వేములవాడ నియోజకవర్గం కథలాపూర్ మండలం / ఆగస్టు 26 ప్రజాదివాస్
జగిత్యాల జిల్లా వేములవాడ నియోజకవర్గ పరిధిలోని కథలాపూర్ మండలం సిరికొండ గ్రామంలో 50 లక్షల జ+ఖీ నిధులతో నిర్మించనున్న శ్రీ



రాజరాజేశ్వర స్వామి దేవస్థాన ఆలయ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే శ్రీ ఆది శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై భూమి పూజ నిర్వహించారు...సిరికొండ గ్రామ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీకగా నిలిచే ఈ ఆలయ నిర్మాణంతో భక్తులకు మరింత మెరుగైన వసతులు అందుబాటులోకి రానున్నాయి.ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఆధ్యాత్మిక క్షేత్రాల అభివృద్ధి, ఆలయాల పరిరక్షణకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

## రాజన్న సిరిసిల్ల జిల్లా యూత్ కాంగ్రెస్ సెక్రటరీగా సందెల శశి కుమార్




రాజన్న సిరిసిల్ల జిల్లా / ఆగస్టు 26 ప్రజాదివాస్
రాజన్న సిరిసిల్ల జిల్లా యూత్ కాంగ్రెస్ సెక్రటరీగా సందెల శశి కుమార్ నియమితులయ్యారు. తన నియామకానికి సహకరించిన తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డికి, రాజన్న సిరిసిల్ల జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కౌడగాని వెంకటేష్ కి, వేములవాడ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు న్యాత నవీన్ కి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సందెల శశి కుమార్ మాట్లాడుతూ పార్టీ నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని తెలిపారు. వేములవాడ శాసనసభ్యులు, రాష్ట్ర విప్ ఆది శ్రీనివాస్ నాయకత్వంలో యువతను ఏకం చేస్తూ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.

## మంత్రి అడ్లూరి చొరవ తో వెంకటాపూర్ గ్రామంలో విద్యుత్ మరమ్మత్తులు.

ప్రజాదివాస్



జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం వెంకటాపూర్ గ్రామం లో గత కొన్ని రోజులుగా విద్యుత్ సరఫరాతో ఇబ్బంది పడడంతో గ్రామ సర్పంచ్ బిల్లకూరు తిరుపతి ఉప సర్పంచ్ అల్లం శ్రీనివాస్ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వెల్గటూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తాటిపర్తి శైలేందర్ రెడ్డి ల కు విషయం వివరించడంతో మంత్రి లక్ష్మణ్ కుమార్ తాటిపర్తి శైలేందర్ రెడ్డి లా ప్రత్యేక చొరవ తో, విద్యుత్ శాఖ ఏ ఈ శ్రీనివాస్, ఏ డి ఈ జనార్దన్, విద్యుత్ శాఖ అధికారులు లైన్ మెన్ చరణ్, ఏ ఎల్ ఎం శ్రీధర్,విద్యుత్ సిబ్బంది పర్యవేక్షణ లో గ్రామ ప్రజలు ఎన్నో ఏళ్లుగా విద్యుత్ సరఫరా లో ఇబ్బంది పడటం తో పాత కేబుల్ వైర్స్ ను తొలిగించి నూతన వైర్స్ బిగించడం జరిగింది.దీని తో విద్యుత్ సరఫరా లో ఇబ్బందులు తీరటం లో గ్రామ సర్పంచ్ బిళ్ళకూరి తిరుపతి, ఉపసర్పంచ్ అల్లం శ్రీనివాస్, గ్రామ పంచాయతీ పాలకవర్గము సభ్యులు,గ్రామ ప్రజలు మంత్రి లక్ష్మణ్ కుమార్ కు , కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తాటిపర్తి శైలేందర్ రెడ్డి కి ఏ ఈ శ్రీనివాస్ , ఏ డి కి విద్యుత్ శాఖ సిబ్బంది కీ కృతజ్ఞతలు తెలిపారు

## ఏబీసీ ఫ్యామిలీ సెలూన్ నూతన బ్రాంచ్ ను ప్రారంభించిన కడియం కావ్య

**- వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య**

ప్రజాదివాస్



బాలసముద్రంలోని ఏబీసీ ఫ్యామిలీ సెలూన్ నూతన బ్రాంచ్‌ను వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య బుధవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా సెలూన్‌ను సందర్శించిన ఎంపీ డా. కడియం కావ్య నిర్వాహకులు ప్రవీణ్, ప్రశాంత్‌లను అభినందించారు.ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య మీడియాతో మాట్లాడుతూ,నూతనంగా ప్రారంభమైన ఏబీసీ ఫ్యామిలీ సెలూన్ ద్వారా ప్రజలకు నాణ్యమైన సౌందర్య, వ్యక్తిగత సంరక్షణ సేవలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని ఎంపీ పేర్కొన్నారు.ఆధునిక సదుపాయాలతో ఏర్పాటు చేసిన ఈ బ్రాంచ్ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ మంచి ఆదరణ పొందాలని ఆకాంక్షించారు.స్థానికంగా నూతన వ్యాపారాలను ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఎంపీ డాక్టర్ కడియం కావ్య తెలిపారు.ఏబీసీ ఫ్యామిలీ సెలూన్ నిర్వాహకులు ప్రవీణ్, ప్రశాంత్ మరింత అభివృద్ధి సాధించాలని ఎంపీ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సెలూన్ సిబ్బంది, నిర్వాహకుల కుటుంబ సభ్యులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## రేపటి గ్రామ సభల్లో అర్హులైన ఓటర్లను గుర్తించాలి:డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క

ప్రజాదివాస్



ఆసిఫాబాద్: రేపు నిర్వహించనున్న గ్రామ సభల్లో అర్హత కలిగిన ప్రతి ఒక్క ఓటరును గుర్తించి, వారు తమ ఓటు హక్కును కోల్పోకుండా చూడాలని కొమురం భీమ్ ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏ--2లు, సూపర్‌వైజర్లు, మండల అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు, వార్డు అధ్యక్షులు, కార్యకర్తలకు సూచించారు.ఎస్ఐఆర్ ఫేజ్--2లో భాగంగా గ్రామ సభల్లో ఓటరు జాబితాను ప్రజలు పరిశీలించుకునేలా అవగాహన కల్పించాలని ఆమె అన్నారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో ఉన్నాయా లేదా పరిశీలించి, అవసరమైన పత్రాలు సమర్పించుకోవడం, అభ్యంతరాలు లేదా దరఖాస్తులు చేసుకోవడంలో ప్రజలకు కాంగ్రెస్ శ్రేణులు సహకరించాలని తెలిపారు.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని, అర్హులైన ఏ ఒక్కరి ఓటు హక్కు కూడా కోల్పోకుండా బీఎల్ఏలు, సూపర్‌వైజర్లు, కాంగ్రెస్ కార్యకర్తలు బాధ్యతగా పనిచేయాలని ఆత్రం సుగుణక్క పిలుపునిచ్చారు.గ్రామ సభలను కాంగ్రెస్ శ్రేణులు సమన్వయంతో పర్యవేక్షిస్తూ, ఎక్కడైనా అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో లేకపోతే నిబంధనల ప్రకారం వారి హక్కును పరిరక్షించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సుగుణక్క పేర్కొన్నారు.

# శ్రీ డాకూరి శివశంకర్ రాజకీయ ప్రస్థానం

**- ప్రజాసేవ-పార్టీ అనుబంధం-యువ నాయకత్వంతో ప్రత్యేక గుర్తింపు**

**- జోగిపేట పట్టణం నుంచి జిల్లా స్థాయి నాయకత్వం వరకు కొనసాగుతున్న రాజకీయ ప్రస్థానం**

ప్రజాదివాస్







జోగిపేట/సంగారెడ్డి: జోగిపేట పట్టణానికి చెందిన శ్రీ డాకూరి శివశంకర్ గారు అందోల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీతో సుదీర్ఘ అనుబంధం కలిగిన యువ నాయకుడిగా గుర్తింపు పొందారు. ప్రజా సమస్యలపై స్పందించడం, పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం, యువతను సమన్వయం చేయడం, కార్యకర్తలకు అందుబాటులో ఉండటం వంటి అంశాలు ఆయన రాజకీయ ప్రస్థానంలో ప్రధానంగా కనిపిస్తాయి.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జోగిపేటలో 1 వ వార్డు కౌన్సిలర్‌గా( అందోలు - జోగిపేట మున్సిపాలిటీ) సేవలందించిన శివశంకర్ గారు, ప్రజా సమస్యలను స్థానిక సంస్థల వేదికగా ప్రస్తావిస్తూ ప్రజల తరఫున తన బలమైన వాణిని వినిపించారు. విషయ పరిజ్ఞానం, వాగ్ధాటి, సమయస్ఫూర్తి, ప్రజలతో సన్నిహిత సంబంధాల కారణంగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు లభించింది.

### పార్టీ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అన్నితానై నిర్వహించిన యువ గర్జన సభను విజయవంతం చేయడంతో పాటు, గౌరవనీయులు కాంగ్రెస్ పార్టీ యువనాయకుడు, దేశ భవిష్యత్ ,అభివృద్ధికి దిశానిర్దేశం చేసే ఏకైక వ్యక్తి శ్రీ రాహుల్ గాంధీ గారు చేపట్టిన భారత్ జోడో యాత్ర సందర్భంగా పార్టీ కార్యకర్తలను సమన్వయం చేయడంలో శివశంకర్ గారు చురుకైన పాత్ర పోషించినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.పార్టీకి అనుకూల పరిస్థితులు ఉన్నప్పుడు మాత్రమే కాకుండా, రాజకీయంగా ప్రతికూల పరిస్థితులు ఎదురైన సమయంలోనూ కార్యకర్తలతో కలిసి కొనసాగడం ఆయన రాజకీయ ప్రస్థానంలోని ముఖ్యమైన అంశంగా అనుచరులు పేర్కొంటున్నారు.అదేవిధంగా, జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీ సురేష్ షెట్కర్ గారి విజయానికి సంబంధించి వివిధ ప్రాంతాల నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ తన వంతు కృషి చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

### తరతరాలుగా కాంగ్రెస్‌తో అనుబంధం

శ్రీ డాకూరి శివశంకర్ గారి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీతో దీర్ఘకాలిక రాజకీయ అనుబంధం ఉంది. ఆయన తాతయ్య కీర్తిశేషులు గాలయ్య గారు ఉమ్మడి మెదక్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షునిగా సేవలందించడంతో పాటు, జోగిపేట పట్టణ సర్పంచ్‌గా రెండు దశాబ్దాలకు పైగా ప్రజలకు సేవలందించారు.ఆయన తండ్రి కీర్తిశేషులు డాకూరి జోగినాథ్ గారు కూడా జోగిపేట సర్పంచ్‌గా మూడు పర్యాయాలు సేవలందించారు. కుటుంబంలోని ఇతర సభ్యులు సైతం కాంగ్రెస్ పార్టీ వివిధ స్థాయిల్లో తనకు అప్పగించిన బాధ్యతలను నిర్వహిస్తూ పార్టీ కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు. పార్టీ బలోపేతానికి కృషి చేశారు. ఇప్పటికీ పార్టీ నియమాలకు, గౌరవనీయులు, ఆరోగ్యశాఖమాత్యులు శ్రీ దామోదర్ సార్ గారి ఆదేశాలను తూచా తప్పకుండా పాటించడం వీరి కుటుంబానికి ఒక ప్రత్యేక గుర్తింపు.ఈ కుటుంబ రాజకీయ ప్రస్థానంలో పదవుల కంటే పార్టీ బాధ్యతలకు ప్రాధాన్యత ఇచ్చే సంప్రదాయం కొనసాగిందని వారి కుటుంబానికి సన్నిహితులు పేర్కొంటున్నారు.“పదవి అనేది బాధ్యతకు గుర్తింపు, సేవ అనేది నాయకత్వానికి అసలైన కొలమానం” అనే భావనతో కుటుంబం రాజకీయాల్లో కొనసాగిందని వారు తెలిపారు.కార్యకర్తలతో సన్నిహిత సంబంధం శివశంకర్ గారి రాజకీయ శైలిలో ప్రధానంగా ప్రస్తావించదగిన అంశం కార్యకర్తలతో ఆయనకు ఉన్న సన్నిహిత సంబంధం. ఎలాంటి ఆర్భాటాలకు తావులేకుండా అందరితో కలిసిమెలిసి ఉండటం, సమస్యలను తెలుసుకుని స్పందించడం, అవసరమైన సమయంలో కార్యకర్తలకు అందుబాటులో ఉండటం ఆయన ప్రత్యేకతలుగా అనుచరులు పేర్కొంటున్నారు. యువతతో నిరంతర సంబంధాలు కొనసాగిస్తూ, వివిధ కార్యక్రమాల్లో వారిని భాగస్వాములను చేయడం ద్వారా జోగిపేట పట్టణంతో పాటు అందోల్ నియోజకవర్గంలో యువ నాయకుడిగా ఆయనకు గుర్తింపు లభించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

### బీసీ యువ నాయకత్వంపై చర్చ

సంగారెడ్డి జిల్లా రాజకీయాల్లో బీసీ సామాజిక వర్గానికి చెందిన యువ నాయకత్వానికి ప్రాధాన్యత కల్పించాలనే అంశంపై ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో జిల్లా స్థాయి పార్టీ బాధ్యతల కోసం శివశంకర్ గారి పేరు కూడా వినిపిస్తోంది.అందోల్ నియోజకవర్గంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నాయకులు, కార్యకర్తలతో ఆయనకు ఉన్న పరిచయాలు, యువతతో ఉన్న అనుబంధం, పార్టీ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర వంటి అంశాలను ఆయన రాజకీయ బలాలుగా అనుచరులు భావిస్తున్నారు.

### అందోల్ నియోజకవర్గానికి రాజకీయ ప్రాతినిధ్యంపై కార్యకర్తల అభిప్రాయం

అందోల్ నియోజకవర్గానికి గత కొన్ని దశాబ్దాలుగా నామినేటెడ్ పదవుల్లో తగిన ప్రాతినిధ్యం లభించలేదనే అభిప్రాయం కాంగ్రెస్ కార్యకర్తల్లో వ్యక్తమవుతోంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా తమ నియోజకవర్గానికి తగిన స్థాయిలో నామినేటెడ్ పదవులు లభించలేదని వారు పేర్కొంటున్నారు.ఈ నేపథ్యంలో దీర్ఘకాలంగా పార్టీతో అనుబంధం ఉన్న కుటుంబాలకు, కష్టకాలంలో పార్టీతో కలిసి పనిచేసిన కార్యకర్తలకు రాజకీయ గుర్తింపు లభించాలనే ఆకాంక్ష కార్యకర్తల్లో ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి.

### యువత, కార్యకర్తలు, సంస్థాగత బలోపేతంపై దృష్టి

ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో పార్టీకి కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే పనిచేసే నాయకత్వం కాకుండా, నిరంతరం కార్యకర్తలతో అనుసంధానమై ఉండే సంస్థాగత నాయకత్వం అవసరమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.ఈ నేపథ్యంలో శివశంకర్ గారి రాజకీయ ప్రస్థానాన్ని పరిశీలిస్తే-స్థానిక సంస్థల ప్రజాప్రతినిధిగా అనుభవం, యువతతో అనుబంధం, పార్టీ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర, కుటుంబ రాజకీయ నేపథ్యం, కార్యకర్తలతో సన్నిహిత సంబంధాలు వంటి అనేక అంశాలు ఆయన రాజకీయ ప్రొఫైల్‌లో కనిపిస్తాయి.“నాయకత్వం అంటే ముందుండటం మాత్రమే కాదు; తనతో నడిచే వారిని కూడా ముందుకు తీసుకెళ్లడం.” అనే భావనకు అనుగుణంగా కార్యకర్తలతో కలిసి పనిచేయడం తన రాజకీయ ప్రయాణంలో కొనసాగిస్తున్నట్లు ఆయన అనుచరులు పేర్కొంటున్నారు.

### జిల్లా స్థాయి బాధ్యతపై ఆసక్తి

సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవికి సంబంధించి వివిధ నాయకుల పేర్లు రాజకీయ వర్గాల్లో చర్చకు వస్తున్న నేపథ్యంలో, శ్రీ డాకూరి శివశంకర్ గారి పేరు కూడా ప్రాధాన్యతతో వినిపిస్తోంది.పార్టీతో సుదీర్ఘ అనుబంధం, కుటుంబ రాజకీయ వారసత్వం, కౌన్సిలర్‌గా ప్రజాప్రతినిధి అనుభవం, యువతతో సంబంధాలు, కార్యకర్తలతో అనుబంధం వంటి అంశాల ఆధారంగా ఆయనకు జిల్లా స్థాయి బాధ్యత అప్పగించాలనే అభిప్రాయాన్ని అనుచరులు వ్యక్తం చేస్తున్నారు.మరోవైపు, జిల్లా స్థాయి పదవికి తుది ఎంపిక పార్టీ అధిష్ఠానం నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుంది. పార్టీ భవిష్యత్ సంస్థాగత అవసరాలు, సామాజిక సమీకరణాలు, నాయకత్వ సామర్థ్యం, జిల్లాలోని అన్ని నియోజకవర్గాలతో సమన్వయం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

### ముగింపు

జోగిపేట పట్టణం నుంచి ప్రారంభమైన డాకూరి శివశంకర్ గారి రాజకీయ ప్రయాణం కౌన్సిలర్‌గా ప్రజాసేవ, కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో చురుకైన భాగస్వామ్యం, యువతతో అనుబంధం, కార్యకర్తలతో సన్నిహిత సంబంధాలు, తరతరాల రాజకీయ వారసత్వం వంటి అనేక అంశాలతో కొనసాగుతోంది.ప్రస్తుత జిల్లా స్థాయి రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆయన పేరు చర్చకు రావడం ఆయన రాజకీయ ప్రస్థానంలో మరో ముఖ్యమైన దశగా చెప్పవచ్చు.పార్టీ కోసం చేసిన సేవకు గుర్తింపు లభిస్తే అది ఒక్క నాయకుడికి మాత్రమే కాకుండా కష్టకాలంలో పార్టీతో నిలిచిన ప్రతి కార్యకర్తకు ప్రోత్సాహంగా మారుతుంది అనే అభిప్రాయం ఆయన అనుచరుల్లో వ్యక్తమవుతోంది. సేవే నాయకత్వానికి పునాది - కార్యకర్తలే పార్టీకి బలం నిరంతర ప్రజా అనుబంధమే నాయకుడి అసలైన గుర్తింపు.జై కాంగ్రెస్ జై సోనియా గాంధీ

## మేడి నరసింహారావు కనబడుటలేదు?

**- పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన భార్య**

ప్రజాదివాస్



అశ్వరావుపేట మండలం నారంవారిగూడెం కాలని (బురుగు గుంపు) గ్రామానికి చెందిన మేడి సావిత్రి ఔ/శీ నరసింహారావు అనే మహిళ తన భర్త కనిపించకుండా పోయినాడని అశ్వరావుపేట పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేయగా, మిస్సింగ్ కేసుగా నమోదు చేయడమైనది.వివరాల్లోకి వెళితే, ఫిర్యాదుదారుని భర్త మేడి నరసింహారావు వయస్సు సుమారు 38 సం॥లు, పామాయిల్ గెలలు కటింగ్ కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తేది: 11.08.2026 నాడు రాత్రి సుమారు 8:00 గంటల సమయంలో కుటుంబ కలహాల కారణంగా ఇంటి నుండి బయటకు వెళ్లిపోయి తిరిగి ఇంటికి రాలేదు. సదరు వ్యక్తి సెల్ ఫోన్ కూడా ఇంట్లోనే వదిలి వెళ్ళిపోయాడు. బంధువుల ఇళ్లలో, చుట్టుపక్కల ప్రాంతాలలో ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు.ఈ మేరకు అశ్వరావుపేట పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి, గాలింపు చర్యలు చేపట్టడమైనది. కనిపించకుండా పోయిన వ్యక్తి వివరాలు: పేరు: మేడి నరసింహారావు వయస్సు: 38-40 సం.లు ఎత్తు: 5.5 అడుగులు మేని ఛాయ: చామన ఛాయ చివరిసారిగా ధరించిన దుస్తులు: లైట్ బ్లూ (స్కై బ్లూ ) గళ్ళ చొక్కా, తెలుపు రంగు జీన్స్ ప్యాంటుపై వ్యక్తి ఆచూకీ ఎవరికైనా తెలిసిన యెడల వెంటనే అశ్వరావుపేట పోలీస్ స్టేషన్ నందు గాని, డయల్ 100 కు గాని సమాచారం అందించగలరు.ఇట్లు,స్టేషన్ హౌస్ ఆఫీసర్,అశ్వరావుపేట పోలీస్ స్టేషన్.

# ప్రభుత్వ భూములు దళారుల పాలు: సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ఆగ్రహం

ప్రజాదివాస్

ఏజెన్సీ ప్రాంతాల్లో కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూములు బడా బాబులు, రియల్ ఎస్టేట్ దళారుల చేతుల్లోకి వెళ్తున్నాయని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నాయకుడు పందూరి వీరబాబు ఆరోపించారు. దమ్మపేట మండలం బంజర్ గ్రామంలోని సర్వే నంబర్ 1458/1/19 భూముల వ్యవహారంపై బుధవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. అధికారుల కుమ్మక్కుతో అక్రమాలు రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు కుమ్మక్కై విలువైన ప్రభుత్వ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అక్రమంగా కట్టబెడుతున్నారని వీరబాబు ఆరోపించారు. సుమారు 30 ఏళ్లుగా ఈ భూములను నమ్ముకుని పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్న పేద గిరిజనులపై హక్కులు లేవంటూ అధికారులు బెదిరింపులకు పాల్పడుతున్నారని విమర్శించారు. గిరిజనులపై అక్రమ కేసులు నమోదు చేస్తూ వారి జీవనోపాధిని దెబ్బతీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల పేర్లతో నకిలీ సంతకాల ఆరోపణలు లంచాలకు ఆశపడి కొందరు అధికారులు నకిలీ పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీ చేస్తున్నారని వీరబాబు ఆరోపించారు. దశాబ్దాలుగా భూములు సాగు చేసుకుంటున్న




గిరిజనులకు పట్టాలు ఇవ్వని అధికారులు, దళారులకు మాత్రం అడ్డదారుల్లో భూములు కట్టబెట్టడం ఏమిటని ప్రశ్నించారు. మృతుల పేర్లతో నకిలీ సంతకాలు సృష్టించి భూములు బదలాయించినట్లు వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. సర్వే నంబర్ 1458/1/19కు సంబంధించిన భూములు ప్రస్తుతం ఎవరి ఆధీనంలో ఉన్నాయో రెవెన్యూ శాఖ బహిర్గతం చేయాలని కోరారు. మంత్రి పొంగులేటికి బహిరంగ ప్రశ్నలు "ఒక్క గజం ప్రభుత్వ భూమి కూడా అన్యాయంగా పోనివ్వం" అని ప్రకటించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు అక్రమాలకు గురవుతున్నాయన్న ఆరోపణలపై ఎందుకు స్పందించడం లేదని వీరబాబు ప్రశ్నించారు. గత ఏడాది డిసెంబర్ 26న హడావుడి చేసిన మంత్రి, ఆ తర్వాత రెవెన్యూ శాఖలో జరుగుతున్న అక్రమాలపై ఎందుకు దృష్టి సారించడం లేదని నిలదీశారు. అధికారులకు ముడుపులు అందడం వల్లే అక్రమాలు జరుగుతున్నాయా? భయపెట్టి సంతకాలు తీసుకుని జారీ చేశారని ఆరోపిస్తున్న సర్వే నంబర్ 1458/1/19కు సంబంధించిన పాస్‌పుస్తకాలను తక్షణమే రద్దు చేస్తారా? లేదా? అని మంత్రి పొంగులేటిని వీరబాబు ప్రశ్నించారు. వందల ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం దారుణమని అన్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి సర్వే నంబర్ 1458/1/19 భూములపై సమగ్ర విచారణ జరిపి, అక్రమాలు నిజమని తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దశాబ్దాలుగా పోడు సాగు చేసుకుంటున్న గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు. సమస్య పరిష్కారం కాకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని పందూరి వీరబాబు హెచ్చరించారు.

# మార్కెట్ యార్డ్ లో రూ. 83 లక్షలతో పలు అభివృద్ధి పనులకి శంకుస్థాపన...

ప్రజాదివాస్

వ్యవసాయ మార్కెట్ యార్డ్ నందు వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన రాష్ట్ర మంత్రీ వర్యులు సీతక్క గారు......తేదీ:-26.08.2026 బుధవారం అనగా ఈరోజున తాడ్వాయి మండల కేంద్రంలోనీ ములుగు జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి గారి అధ్యక్షతన వ్యవసాయ శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరరావు గారి సహకారంతో వ్యవసాయ మార్కెట్ యార్డ్ నందు వివిధ పనుల శంకుస్థాపన పనులకు రూ. 83 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన రాష్ట్ర మంత్రీ వర్యులు సీతక్క గారు.......ఈ సందర్భంగా మంత్రీ సీతక్క గారు మాట్లాడుతూ ములుగు నియోజకవర్గానికి వ్యవసాయ శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరరావు గారు మార్కెట్ యార్డ్ లకు 3 కోట్ల రూపాయలు మంజూరు చేయగా అందులో భాగంగానే తాడ్వాయి మండలానికి 83 లక్షలతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందని అన్నారు . వ్యవసాయ రంగానికి ప్రజా ప్రభుత్వం పెద్ద పీట వేస్తుంది అని అన్నారు. రైతులకు ఏకకాలంలోనే 2 లక్షల రుణ మాఫీ చేసింది ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు , త్వరలోనే మండలంలో మరొక యార్డును మంజూరు చేస్తామని తెలిపారు......ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ , జిల్లా గ్రంథాలయ







సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్ , తాడ్వాయి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంకిడి నరసింహ స్వామి , వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సారంగపాణి , కమిటీ బృందం , మాజీ మండల అధ్యక్షులు బొల్లు దేవేందర్ ముదిరాజ్ , సహకార సంఘం చైర్మన్ పులి సంపత్ గౌడ్ , జిల్లా ప్రధాన కార్యదర్శి జాలపు అనంత రెడ్డి , జిల్లా కార్యదర్శి ఇర్ప సునీల్ దొర , సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు గడ్డం నాగ భూషణం , సర్పంచులు మొగుళ్ళపల్లి రవీందర్ , కోర్నబెల్లి సావిత్రి , యాప కళా - మోహన్ రావు , మల్లూరు లక్ష్మీ నరసింహ ఆలయ డైరెక్టర్ పల్నాటి సత్యం , ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పీరిల వెంకన్న , సీతక్క యువసేన జిల్లా అధ్యక్షులు చర్ప రవీందర్ , జిల్లా నాయకులు తాండాల శ్రీను , మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గొంది సరిత , యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు కోడి సతీష్ కుమార్ , కిసాన్ సెల్ మండల అధ్యక్షులు భూషబోయిన రవి కుమార్ , మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శనిగరపు చిరంజీవి , ఆత్మ డైరెక్టర్ మర్రి నరేష్ , వార్డ్ మెంబర్ సభ్యులు బొల్లు నాగేంద్ర కుమార్ , మండల నాయకులు ఆలం సాంబశివరావు , బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఎండీ ముజఫర్ , ఊరట్టం ఉప సర్పంచ్ కాక రంజిత్ , క్లస్టర్ మండల ఇంచార్జీ సాదు చక్రపాణి , పులి నర్సయ్య గౌడ్ , వంగరి సదానందం , ఓర్సు రామారావు , ఆలేటి జైపాల్ రెడ్డి , గ్రామ కమిటీ అధ్యక్షులు పాక రాజేందర్ , సిద్ధబోయిన రానా రమేష్ , పాలకుర్తి మధు , మడకం శోభన్ , ఖలీల్ , సింగిల్ విండో డైరెక్టర్లు రంగారబోయిన జగదీష్ , కాయితి లింగాచారి , యానాల సిద్ధి రెడ్డి , బండారి చంద్రయ్య , మహిళా నాయకురాలు ముంద్రాతి రాజశ్రీ , నాగమణి , మండల సోషల్ మీడియా కో ఆర్డినేటర్ గజ్జల రాజశేఖర్ , యూత్ కాంగ్రెస్ నాయకులు , తదితరులు పాల్గొన్నారు.....

# ఆడబిడ్డల వివాహానికి చేయూత

**- హుగ్గెల్లీ గ్రామ సర్పంచ్ పట్లోళ్ల విమల శ్రీనివాస్ రెడ్డి**

ప్రజాదివాస్

హుగ్గెల్లీ గ్రామంలో ఆడబిడ్డల వివాహాలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ అండగా నిలుస్తున్నామని గ్రామ సర్పంచ్ పట్లోళ్ల విమల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం హుగ్గెల్లీ గ్రామానికి చెందిన బూతపిల్లి శంకరమ్మ--బక్కప్ప దంపతుల కుమార్తె వైష్ణవి (గాయత్రీ) వివాహ వేడుకకు గ్రామ సర్పంచ్ పట్లోళ్ల విమల శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వధువు కుటుంబానికి రూ.10,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ విమల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ఆడబిడ్డల వివాహాలు పేద కుటుంబాలకు ఆర్థికంగా భారంగా మారుతున్న నేపథ్యంలో తన వంతు సహాయాన్ని అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటానని తెలిపారు. గ్రామంలోని పేద, మధ్యతరగతి కుటుంబాలకు అవసరమైన సమయంలో అండగా నిలవడం తన బాధ్యతగా భావిస్తున్నానని పేర్కొన్నారు. వధువు కుటుంబ సభ్యులు మాట్లాడుతూ, తమ కుమార్తె వివాహానికి ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచిన సర్పంచ్ పట్లోళ్ల విమల శ్రీనివాస్ రెడ్డి గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు రాజు, వార్డు సభ్యులు బాల్‌రాజు, సాల్మన్, సీనియర్ నాయకులు మునిందర్ రెడ్డి, నర్సింహులు, అశోక్, వెంకట్ స్వామి, అక్బర్, ప్రవీణ్ పాండు, లక్ష్మారెడ్డి, ప్రకాష్‌తో పాటు గ్రామస్థులు, వధువు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# కామారెడ్డిలో ఘనంగా మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలు..

ప్రజాదివాస్



కామారెడ్డి జిల్లా కేంద్రంలో మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు పాత బస్టాండ్ నుంచి భారీ జులూస్ నిర్వహించారు. రైల్వే కమాన్, నిజాంసాగర్ ఎక్స్ రోడ్, కొత్త బస్టాండ్, రైల్వే గేట్, సైలానీ బాబా కాలనీ మీదుగా ఇస్లాంపూర్ నిరంజశావళి దర్గా వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు మాట్లాడుతూ. కులమతాలకు అతీతంగా ప్రజలంతా ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. గంగా జమునా తహజీబ్‌ను కాపాడుకోవాలని, ప్రవక్త మహమ్మద్ బోధించిన ప్రేమ, శాంతి, సోదరభావం, మానవత్వం వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని మదీనా మజీద్ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# మిలాద్-ఉన్-నబీ పండగ సందర్భంగా సామూహిక వివాహాల కార్యక్రమంలో పాల్గొన్నా

**- మాజీ మంత్రివర్యులు జహీరాబాద్ ఇంచార్జ్ డా ఏ.చంద్రశేఖర్**

ప్రజాదివాస్



జహీరాబాద్ పట్టణంలోని ఈద్గా మైదానంలో మిలాద్-ఉన్-నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన సామూహిక వివాహాల కార్యక్రమంలో లిమాజీ మంత్రివర్యులు డా ఎ.చంద్రశేఖర్ పాల్గొన్నారు..ప్రతి సంవత్సరం ఇలాంటి సామూహిక వివాహాలు జరుపుతున్న మిలాద్ ఉన్ నబి కమిటీ సభ్యులకు అభినందనలు తెలియజేశారు..అనంతరం నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేసిన దాతలను అభినందించారు. సమాజ సేవలో భాగంగా రక్తదానం చేయడం ఎంతో గొప్ప సేవ అని పేర్కొంటూ, రక్తదాతల సేవాభావాన్ని ప్రశంసించారు. ఈ కార్యక్రమం ప్రేమ, సోదరభావం, మానవత్వం మరియు సేవా స్ఫూర్తికి ప్రతీకగా నిలిచింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ యూనుస్ , జహీరాబాద్ పట్టణ అధ్యక్షులు నరేష్ గౌడ్ , మాజీ పట్టణ అధ్యక్షులు కండేం.నర్సింలు కౌన్సిలర్ మహేష్ కుమార్ , సర్పంచ్ ప్రేమ్ రాథోడ్ ,కాంగ్రెస్ నాయకులు వాసీమ్ ,గౌస్ ,ఇనాయత్ ,అజర్ , మెయిన్ ,మొయిజ్ ,యువజన కాంగ్రెస్ నాయకులు సోహైల్ ,మిలాద్ కమిటీ సభ్యులు స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు..

# టీడీపీ నేతలకు వైసీపీ సూటి కౌంటర్

ప్రజాదివాస్




ఎన్టీఆర్ జిల్లా నందిగామ పట్టణంలో సిబిఐ పేరు చెబితే ఎవరు భయపడుతున్నారో ప్రజలకు తెలుసు నిజాయితీపై అంత నమ్మకం ఉంటే స్వతంత్ర సిబిఐ విచారణకు సిద్ధమని ప్రకటించండి డిస్సీ పారదర్శకమే అంటున్నారు అయితే ప్రతి అభ్యర్థి మార్కులు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ స్పోర్ట్స్ కోటా వివరాలను ప్రజల ముందుంచండి 39 పోస్టులు ఖాళీగా ఉంచామని చెప్పడం గొప్ప విషయం కాదు నియామక ప్రక్రియపై వచ్చిన ప్రతి అనుమానానికి ఆధారాలతో సమాధానం చెప్పాలి గంజాయి విషయంలో గతాన్ని తవ్వడం ఎందుకు? నేడు రాష్ట్రంలో డ్రగ్స్ పూర్తిగా నియంత్రణలో ఉన్నాయని చెప్పగలరా చట్టం ముందు అందరూ సమానమే అయితే అదే నిబంధన అందరికీ వర్తించాలి అధికార పార్టీ వాళ్లకు ఒక న్యాయం ప్రతిపక్షానికి మరో న్యాయం ఉండకూడదు పాత కేసుల పేర్లు చెప్పి ప్రస్తుత ప్రశ్నల నుంచి తప్పించుకోలేరు ప్రెస్‌మీట్లలో ఆరోపణలు కాదు అసెంబ్లీలో ఆధారాలతో చర్చకు రండి ప్రజలు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పండి ప్రశ్నించిన వారిపై ఎదురుదాడి చేయడం ఆపండి నిజాయితీపై నమ్మకం ఉంటే సిబిఐ విచారణకు ఎందుకు భయం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్టీఆర్ జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు మార్త శ్రీనివాసరావు

ప్రజా దివాస్
తెలుగు దినపత్రిక
27-08-2026

## జగ్గంపేట వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా మదర్ థెరిస్సా జయంతి వేడుకలు



ప్రజాదివాస్
మానవసేవే మాధవసేవగా భావించి అనేక సేవా కార్యక్రమాలు అందించిన అమృతమూర్తి, దయామయి మదర్ థెరిస్సా జయంతి వేడుకలు వాకర్స్ హెల్త్ క్లబ్ (జగ్గంపేట) ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.మదర్ థెరిస్సా సేవలను స్ఫూర్తిగా తీసుకుని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జగ్గంపేట వాకర్స్ క్లబ్ ఫౌండర్, మాజీ జిల్లా గవర్నర్ కొత్త వెంకటేశ్వరరావు( కొండబాబు) మాట్లాడుతూ మానవతా మూర్తి, మానవసేవే మాధవసేవగా భావించే మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా ఒక పవిత్రమైన సేవా కార్యక్రమాన్ని చేపట్టామని అన్నారు.ఈ కార్యక్రమంలోవాకర్స్ క్లబ్ ఫౌండర్, మాజీ జిల్లా గవర్నర్ కొత్త వెంకటేశ్వరరావు (కొండబాబు) వెచ్చ నాగసత్య ఎం సురేష్, చంద్రమౌళి వెంకట శాస్త్రి, రాజేష్ పొట్టి రాజేష్:వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## ఎక్కడికెళ్లినా ఆకలి తీర్చే స్మార్ట్ రేషన్ కార్డు

- స్మార్ట్ రేషన్ కార్డుతో సన్న బియ్యం సద్వినియోగం చేసుకోవాలి..
- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సొసైటీ డైరెక్టర్ సిద్దన రమేష్..
- సొసైటీ చైర్మన్ లు భూక్య గోపాల్ నాయక్ మొగిలి వెంకట్ రెడ్డి..

ప్రజాదివాస్
చెన్నారావుపేట మండలం లోని పలు గ్రామాల్లో స్మార్ట్ రేషన్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలి.రేషన్ కార్డు కేవలం బియ్యం తెచ్చిపెట్టే సాధనం కాదని, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సొసైటీ డైరెక్టర్ సిద్దన రమేష్, సొసైటీ చైర్మన్ లు భూక్య గోపాల్ నాయక్, మొగిలి వెంకట్ రెడ్డి లు అన్నారు..రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి ఆదేశాల మేరకు ఉప్పర పెల్లి లింగగిరి తిమ్మారాహేన్ పహాడ్ పాపయ్య పేట గ్రామాల్లో ఈ రోజు గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు వట్టే తిరుపతి రెడ్డి మంద సోమయ్య జయరాజ్ ఉప్పరి కొమురయ్యల ఆధ్వర్యంలో చేపట్టారు..ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సొసైటీ డైరెక్టర్ సిద్దన రమేష్ సొసైటీ చైర్మన్ లు భూక్య గోపాల్ నాయక్ మొగిలి వెంకట్ రెడ్డి లు హాజరై కార్డులను పంపిణీ చేశారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన స్మార్ట్ రేషన్ కార్డులను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో సన్న బియ్యం ప్రతి పేదవాడికి అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందని వారు అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు అందేలా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.రేషన్ కార్డుల ప్రక్రియ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి రేషన్ కార్డులను అందిస్తే నేటి ప్రజా పాలనలో సీఎం రేవంత్ రెడ్డి రేషన్ కార్డులను అందించారని పేద ప్రజలు సన్నబియ్యం తీసుకొని ఆత్మ గౌరవంగా ఉండాలనే లక్ష్యంతో రేషన్ కార్డులను అందించారని వారు అన్నారు.స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు మరింత సులభంగా అందనున్నాయని పేర్కొన్నారు.అర్హత ఉన్నవారు



రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని వారు సూచించారు.ఈ కార్యక్రమంలో లింగగిరి సర్పంచ్ మెడ బోయిన రజిత కుమార్ తిమ్మారహేన్ పహాడ్ సర్పంచ్ దారవత్ రమేష్ ఆర్ఐ లు రషీద్,మమత సొసైటీ డైరెక్టర్ మంద యాకయ్య గౌడ్,ఉప సర్పంచ్ ల ఫోరమ్ మండల అధ్యక్షుడు బండి హరీష్ మండల నాయకులు మల్లారెడ్డి,నరేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి ఉప సర్పంచ్ కొర్ర మోహన్ నాయక్ యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు కందిక ప్రవీణ్ కూమార్ మాజీ ఉప సర్పంచ్ కాసాని రమేష్ వార్డు సభ్యులు రవికిరణ్, బిక్షపతి,దొనకొండ కరుణాకర్ రెడ్డి,దొమ్మటి కార్తీక్, పెరుమాండ్ల సుధన్ రెడ్డి,ఎల్లాగౌడ్,జిపిఓ అశోక్, డీలర్ కొత్వాల్,మమత, రాజు తదితరులు పాల్గొన్నారు..

## విశ్వమాత, మదర్ థెరిస్సా కు కైకలూరు కూటమి నాయకులు ఘన నివాళులు



ప్రజాదివాస్
మదర్ థెరీస్సా తన జీవితమంతా పేదలు, అనాధలు, నిరాశ్రయులు, అభాగ్యుల సేవకే అంకితం చేశారని కైకలూరు కూటమి నాయకులు కొనియాడారు. బుధవారం ఏలూరు జిల్లా, నియోజకవర్గ కేంద్రమైన కైకలూరు పట్టణంలో తెలుగుదేశం పార్టీ సారథ్యంలో విశ్వమాత, భారతరత్న మదర్ మదర్ థెరీసా గారి 116వ జయంతిని పురస్కరించుకుని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవసేవే - మాధవసేవ అని స్ఫూర్తితో ఆమె అందించిన సేవలు ప్రపంచానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పి.రాధాకృష్ణ, రాష్ట్ర తెలుగు యువత కార్య నిర్వాహక కార్యదర్శి పూల రామచంద్రరావు (రాజి), టిడిపి నాయకులు వీరా బత్తిన సుధ, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ లక్కింశెట్టి రామ్మోహనరావు, కైకలూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ డైరెక్టర్ ఎం.డి ఉస్మాన్, పట్టణ టిడిపి అధ్యక్షులు పడమట వాసు, ప్రధాన కార్యదర్శి రసూల్ ఖాన్, మండల తెలుగు మహిళ మాజీ కార్యదర్శి శీలం కృష్ణవేణి, మండల టిడిపి ఉపాధ్యక్షులు మహమ్మద్ జహీర్, వేములపల్లి కారుణ్య, దైతగుంజ రామస్వామి, ఏగిరెడ్డి సురేష్, కట్టా శ్రీనివాసరావు, హబీబ్ పాషా, రహీమ్, అట్లూరి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## జోగిపేటలో డాకూరి గాలయ్య 35వ వర్ధంతి ఘనంగా నిర్వహణ

- కాంగ్రెస్ కార్యాలయంలో చిత్రపటానికి నివాళులర్పించిన నాయకులు, కార్యకర్తలు

ప్రజాదివాస్
మాజీ సర్పంచ్, ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షుడు డాకూరి గాలయ్య 35వ వర్ధంతి వేడుకలు బుధవారం జోగిపేట పట్టణ కేంద్రంలో ఘనంగా జరిగాయి. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో డాకూరి గాలయ్య మనుమడు, మాజీ కౌన్సిలర్ డాకూరి




శివశంకర్, జోగిపేట మున్సిపల్ కౌన్సిలర్లు గడ్డి అరుణ్ కుమార్, కొషికె రాజశేఖర్, ఆత్మా కమిటీ డైరెక్టర్లు ఖాలేద్, చేనేత సంఘం డైరెక్టర్ చిట్యాల మధు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అల్లె యాదగిరి, మైనారిటీ సీనియర్ నాయకులు మోసిన్ భాయ్, కొత్త శ్రీనివాస్, రమేష్ గౌడ్, డాకూరి నాగరాజు, ఆకుల నందు, భాస్కర్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### పార్టీ కోసం అహర్నిశలు కృషి చేసిన నాయకుడు:-

చిట్యాల మధు "డాకూరి గాలయ్య అన్న కాంగ్రెస్ పార్టీకి వెన్నెముక లాంటి వారు. సర్పంచ్ గా, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీ అధ్యక్షుడిగా పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేశారు. ఆయన చూపిన మార్గం నేటి తరం కార్యకర్తలకు ఆదర్శం" అని అన్నారు.

## జేత్వాన్ బుద్ధ విహార్ లో మదర్ థెరిస్సా జయంతి

ప్రజాదివాస్
వాంకిడి మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్ లో కరుణామయి, సేవామూర్తి మదర్ తెరిసా 116వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆమె



చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు.అనంతరం భారతీయ బౌద్ధ మహా సభ జిల్లా అధ్యక్షులు డాక్టర్ అశోక్ మహుల్కర్ మాట్లాడుతూ కరుణామయి, సేవముర్తి మదర్ థెరిస్సా మరణించే వరకు మానవ సేవయే మాధవ సేవ అంటూ సేవ చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో అర్ పి ఐ జిల్లా అధ్యక్షులు దుర్గం శ్యామ్ రావు, సమాజ అధ్యక్షులు రాజేశ్వర్ ఉప్రే, శ్యామ్ రావు లహిజి దుర్గే,బౌద్ధ ఉపాసకులు ప్రకాష్ ఉప్రే, డొంగ్రే బిక్షపతి, మహుల్కర్ అరుణ్, జాడే మారుతి,ఇంద్రజిత్ ఉప్రే,భీమ్ రావు,వెనకటి జాడే, తిరుపతి,సుదర్శన్, ప్రకాష్,తదితరులు పాల్గొన్నారు.

## మానగానాని రాజు కుటుంబానికి అండగా మాజీ సర్పంచ్ ఉడుత సంగీత మహేందర్

ప్రజాదివాస్
నీరుకుల్లా మాజీ సర్పంచ్ ఉడుత సంగీత మహేందర్ 50 కేజీల బియ్యం అందజేత నీరుకుల్లా గ్రామానికి



చెందిన మానగానాని రాజు గత ఐదు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించి 50 కేజీల బియ్యాన్ని అందజేసిన నీరుకుల్లా మాజీ సర్పంచ్ ఉడుత సంగీత మహేందర్

ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు మాజీ పి ఎ సి ఎస్ డైరెక్టర్ సోషల్ మీడియా మండల్ ప్రెసిడెంట్ ఉడుత రాజేందర్ మూడవ వార్డు నెంబర్ మానగాని రాకేష్ యూత్ మండల ప్రధాన కార్యదర్శి పిట్టల రాజకుమార్ బి ఎల్ ఓ 92 బూత్ దురుశెట్టి శ్రావణ్ కుమార్ యూత్ నాయకులు ఉడుత మాధవ్ మానగాని గోపాల్ తదితరులు పాల్గొని అందజేసినారు.

## గన్ను పద్మావతి దశదిన కర్మ కార్యక్రమంలో డా. పెసరు విజయచందర్ రెడ్డి

ప్రజాదివాస్
దామెర మండలం పులుకుర్తి గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు గన్ను సతీష్ తల్లి గన్ను పద్మావతి



దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొని,వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన బీజేపీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇంచార్జ్ డా. పెసరు విజయచందర్ రెడ్డి అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పి, ఈ కష్ట సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. గన్ను పద్మావతి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో దామెర మండల అధ్యక్షులు వేల్పుల రాజ్‌కుమార్, మండల ప్రధాన కార్యదర్శి సుర చందర్, పెంచల జగన్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## మానవతా సేవకు ప్రతీకగా రక్తదాన శిబిరం

- రక్తదాన శిబిరంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



ప్రజాదివాస్
నందిగామ మానవ మహోపకారి విశ్వ కారుణ్యమూర్తి జగత్ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వారి జన్మదినాన్ని పురస్కరించుకుని నందిగామ పట్టణంలోని ప్రతిభ హైస్కూల్ వేదికగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సందర్శించారు ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు కూటమి నాయకులతో కలిసి రక్తదాన శిబిరాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే సౌమ్య రక్తదాతలను అభినందించారు అత్యవసర సమయంలో ఒకరి ప్రాణాలను కాపాడేందుకు రక్తదానం ఎంతో విలువైన సేవ అని సమాజంలో మానవతా విలువలను పెంపొందించడంలో ఇటువంటి కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం బోధించిన ప్రేమ దయ సేవా భావాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజలంతా పరస్పర సహకారం సోదరభావంతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే సౌమ్య ఆకాంక్షించారు రక్తదాన శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను మత పెద్దలను కూటమి నాయకులను ఆమె అభినందించారు ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు కూటమి నాయకులు కార్యకర్తలు యువత మరియు రక్తదాతలు పాల్గొన్నారు

# ఆంధ్ర రాష్ట్రంలో మరోసారి ఉద్యోగాల జాతర

**- 10,060 పోస్టులతో జాబ్ క్యాలెండర్**

**- రాష్ట్ర టిడిపి నాయకులు డాక్టర్ కత్తెర సురేష్ కుమార్ వెల్లడి**



ప్రజాదివాస్

ఆంధ్ర రాష్ట్రంలో మరోసారి ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు చేపట్టటానికి కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు రాష్ట్ర తెలుగుదేశం నాయకులు డాక్టర్ కత్తెర సురేష్ కుమార్ వెల్లడించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 10,060 పోస్టులతో జాబ్ క్యాలెండర్ నిర్వహించటానికి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉన్నట్టు ఆయన తెలియజేశారు. రానున్న రెండు నెలల కాలంలో ఈ జాబ్ క్యాలెండర్ను ప్రకటిస్తారని చెప్పారు. నాలుగు దశల్లో ఉద్యోగాల భర్తీకి ఏర్పాట్లు చేస్తారని, ఇది నిరుద్యోగ యువకులకు ఒక శుభవార్త లాంటిదని చెప్పారు. అదేవిధంగా గ్రూప్, వన్ గ్రూప్ టు పోస్టులతో పాటు డీఎస్సీ ద్వారా 2,991 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన వివరించారు . సెప్టెంబరు, అక్టోబర్ నెలలో నోటిఫికేషన్లు వెలివడనున్నట్టు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని చెప్పి ఒక ఉద్యోగం కూడా ఇవ్వలేదని విమర్శించారు. నేడు కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన తర్వాత ఒకేసారి మెగా డీఎస్సీ ద్వారా వేలాది ఉద్యోగాలు ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. వాటిని చూసి వైసిపి నాయకులు ఓర్చుకోలేక అసత్య ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. మెగా డీఎస్సీ ద్వారా ఎంతో ఆనందంతో వేలాది మంది ఉద్యోగాలలో చేరి ఆనందంగా ఉంటే కుళ్ళుకుని ఏడాది తర్వాత వైసిపి అవకతవకలు జరిగాయి అంటూ రోడ్డు ఎక్కటం హాస్యాస్పదంగా ఉందన్నారు. వైసిపి తమ హయాంలో చేయలేని పనులను కూటమి ప్రభుత్వం చేస్తుండటంతో తట్టుకోలేక పోతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం యువత భవితను తీర్చిదిద్దే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుంటే దానిని అడ్డుకోవటానికి వైసిపి కుట్రలు పన్నుతుందని విమర్శించారు. ప్రజలు వీటన్నిటిని గమనిస్తున్నారని సురేష్ కుమార్ అన్నారు. తమ పద్ధతులను వైసిపి మార్చుకోకుంటే ప్రజలు తీవ్రస్థాయిలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసిపి ఘోరంగా ఓడిపోవడం ఖాయం అన్నారు. కూటమికి ఓటమి లేదని వైసీపీకి భవిష్యత్తు లేదని జోస్యం చెప్పారు. ఎన్ని ర్యాలీలు చేసిన ఎన్ని ఆందోళనలు చేసిన వైసీపీ పార్టీని ప్రజలు నమ్మరు అన్నారు కూటమి చేస్తున్న మంచి పనులను ప్రశంసించాలని సూచించారు.

# జగపతినగరంలో అంగరంగ వైభవంగా పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు

**- హాజరై చిన్నారులకు బోనాలు ఎత్తిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ**

ప్రజాదివాస్



కిర్లంపూడి మండలం జగపతినగరం గ్రామంలో పైడితల్లి అమ్మవారి జాతర అంగరంగ వైభవంగా జరిగింది. మహిళలు పెద్ద ఎత్తున బోనాలతో ఊరేగుతూ భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ జాతరకు జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యులు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ హాజరయ్యారు. మహిళలకు స్వయంగా బోనాలు నెత్తిన పెట్టి జాతరలో పాల్గొని సందడి చేశారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ పైడితల్లి అమ్మవారి కృపాకటాక్షాలతో ఈ ప్రాంతమంతా సుభిక్షంగా ఉండాలి.- గ్రామాల్లో సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ ఇలాంటి జాతరలు ఘనంగా నిర్వహించడం అభినందనీయం.- మహిళలు భక్తిశ్రద్ధలతో జాతరలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో చదరం చంటిబాబు, తూము కుమార్, కుర్ల చినబాబు, కాళ్ళ వెంకటేష్, ఆలయ కమిటీ చైర్మన్ కర్రీ సూర్యకుమార్, ఆలయ కమిటీ సభ్యులు దాడి బాబి, శరకణం శివ, చదరం ఆదిబాబు, రాపేటి ఇంద్ర తదితరులు పాల్గొన్నారు.

# సేవా స్ఫూర్తికి ప్రతీక బూచేపల్లి వెంకాయమ్మ

**-70వ జన్మదిన వేడుకలకు వెల్లువెత్తిన అభిమానం..**

**- శుభాకాంక్షలతో మార్మోగిన ఒంగోలు ఏ-1 కన్వెన్షన్ హాల్**





ప్రజాదివాస్

ఒంగోలు బుధవారం ప్రకాశం జిల్లా పరిషత్ చైర్పర్సన్, ప్రకాశం జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి మాతృమూర్తి బూచేపల్లి వెంకాయమ్మ 70వ జన్మదిన వేడుకలు బుధవారం ఒంగోలు పట్టణంలోని ఏ-1 కన్వెన్షన్ హాల్లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. కుటుంబ సభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై వెంకాయమ్మకు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వేడుకల సందర్భంగా ఏ-1 కన్వెన్షన్ హాల్ అభిమానులు, పార్టీ శ్రేణులతో సందడిగా మారింది. జిల్లాలోని నలుమూలల నుంచి తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బూచేపల్లి వెంకాయమ్మను కలిసి పుష్పగుచ్చాలు అందజేసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆమె ఆయురారోగ్యాలతో, ఆనందంగా మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రజాసేవలో ప్రత్యేక ముద్ర బూచేపల్లి వెంకాయమ్మ ప్రజలతో మమేకమై ఉంటూ సామాజిక సేవా కార్యక్రమాలకు అందిస్తున్న ప్రోత్సాహం, ప్రజల పట్ల చూపుతున్న ఆప్యాయతకు పలువురు నాయకులు ప్రశంసలు తెలిపారు. ప్రజాసేవా స్ఫూర్తితో ఆమె అందిస్తున్న సేవలు మరింత విస్తరించాలని, సమాజంలోని పేదలు, బలహీన వర్గాల సంక్షేమానికి ఆమె సేవలు నిరంతరం కొనసాగాలని ఆకాంక్షించారు. అభిమానుల ఆత్మీయతకు వేదికగా వేడుకలు జన్మదిన వేడుకలకు హాజరైన అభిమానులు, పార్టీ నాయకులు వెంకాయమ్మతో ఆత్మీయంగా గడిపారు. ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు, ప్రజలతో ఆమెకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. బూచేపల్లి కుటుంబంపై అభిమానులు చూపిస్తున్న ఆదరణకు ఈ వేడుకలు నిదర్శనంగా నిలిచాయి. వెంకాయమ్మ 70వ జన్మదిన వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో జరగడంతో బూచేపల్లి అభిమానుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. ఆమె ప్రజాసేవా ప్రయాణం ఇలాగే నిరంతరం కొనసాగాలని, ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కలగాలని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.

# గవర్నర్ పర్యటన నేపథ్యంలో ఓగేరు వాగు బ్రిడ్జి శుభ్రత

**- పారిశుధ్య పనులు చేపట్టిన మున్సిపల్ సిబ్బంది**

ప్రజాదివాస్



చిలకలూరిపేట మండలం బొప్పిడి గ్రామంలో గవర్నర్ పర్యటన నేపథ్యంలో మున్సిపల్ అధికారులు పారిశుధ్య పనులను ముమ్మరం చేశారు. గవర్నర్ పర్యటనకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రహదారులు, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దే చర్యలు చేపట్టారు. చిలకలూరిపేట మున్సిపల్ కమిషనర్ శ్రీ హరిబాబు ఆదేశాల మేరకు సెంట్రీ ఇన్స్పెక్టర్ సునీత ఆధ్వర్యంలో, సానిటరీ మేస్త్రీలు షేక్ ఉమర్, బైరా సతీష్ పర్యవేక్షణలో మున్సిపల్ సిబ్బంది పారిశుధ్య పనులు నిర్వహించారు. చిలకలూరిపేట పట్టణంలోని అడ్డరోడ్డు సెంటర్ నుంచి బొప్పిడి గుడి వరకు రహదారి వెంబడి జంగిల్ క్లియరెన్స్, చెత్త తొలగింపు, పరిసరాల శుభ్రత వంటి పనులు చేపట్టారు. ముఖ్యంగా ఓగేరు వాగు బ్రిడ్జి పరిసరాలను శుభ్రం చేసి, రహదారిపై ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. గవర్నర్ పర్యటనను దృష్టిలో ఉంచుకుని రహదారులు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

# సెప్టెంబర్ 5న 1,008 టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అప్పగిస్తాం - ప్రత్తిపాటి

ప్రజాదివాస్




రెండోదశలో నిర్మిస్తున్న 1,008 టిడ్కో గృహాలను సెప్టెంబర్ 5న లబ్ధిదారులకు అప్పగిస్తామని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో అర్హులకు ఇళ్లు మంజూరైనప్పటికీ, అనంతరం నిర్మాణ పనులు నిలిచిపోవడంతో డబ్బులు చెల్లించిన లబ్ధిదారులు ఎనిమిదేళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పంతో ఎట్టకేలకు వారి సొంతింటి కల సాకారం కాబోతోందని పేర్కొన్నారు. బుధవారం పట్టణ శివార్లలోని టిడ్కో గృహ సముదాయంలో జరుగుతున్న రెండోదశ ఇళ్ల నిర్మాణ పనులను అధికారులు, గుత్తేదారు సంస్థ ప్రతినిధులతో కలిసి ప్రత్తిపాటి పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. తొలి దశ ఇళ్ల అప్పగింతలో తలెత్తిన సమస్యలు రెండోదశలో పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని ప్రత్తిపాటి తెలిపారు. ఇళ్లు పొందే లబ్ధిదారులు వాస్తవంగా అక్కడ నివాసముంటున్నట్లు నిర్ధారించుకున్న తర్వాతే రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఇళ్లు నిజంగా అవసరమైన అర్హులను గుర్తించి, నిర్ధారణ అనంతరం ఆరు నెలల నుంచి ఏడాది లోపు రిజిస్ట్రేషన్లు పూర్తి చేస్తామని తెలిపారు. తొలి దశలో నిర్మించిన 4,510 ఇళ్లలో ఇప్పటికీ సుమారు 1,700 ఇళు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. నివాసం లేకపోతే ఇళ్లు దెబ్బతిని ప్రభుత్వం, లబ్ధిదారులు ఇద్దరూ నష్టపోయే అవకాశం ఉందన్నారు. నాయకులు, టిడ్కో గృహాల పరిశీలనలో ప్రత్తిపాటి వెంట నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ రఫాని, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, టీడీపీ నాయకులు జంగా వినాయకరావు, కొత్త కోటేశ్వరరావు, మురకొండ మల్లిబాబు, మున్సిపల్ కమిషనర్ పతి శ్రీహరిబాబు, డీఈ అబ్దుల్ రహీమ్, ఏఈ సుబ్బారాయుడు, రాకేష్ తదితర అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు

# ఈనెల 31న వేమూరులో జాబ్ మేళా

ప్రజాదివాస్



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ మరియు వేమూరు,ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు సహకారంతో 18 ప్రముఖ కంపెనీలతో ఈ నెల 31వ తేదీ సోమవారం వేమూరు లో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు అమృతలూరు ఎంపీడీవో, జొన్నలగడ్డ వినయ్ బాబు మంగళవారం తెలిపారు. ఆరోజు ఉదయం 9 గంటల నుండి వేమూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పదవ తరగతి, ఇంటర్మీడియట్, ఐటిఐ, డిప్లమా, డిగ్రీ మరియు పీజీ వరకు విద్యార్హతలు కలిగిన యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నమోదు లింక్, https://naipunyam.gov.in/user-registration రెజ్యూమ్ ( ఒకటి లేదా ఎక్కువ ప్రతులు), అర్హత సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు, ఆధార్ కార్డు జిరాక్స్,జాబ్ మేళాకు వచ్చే అభ్యర్థులు ఫార్మల్ డ్రెస్ లో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. అభ్యర్థులు జాబ్ మేళాకు వచ్చే ముందు నైపుణ్యం పోర్టల్ లో రిజిస్ట్రేషన్ చేసుకుని అడ్మిట్ కార్డు డౌన్లోడ్ చేసుకోవాలని, అదేవిధంగా జాబ్ మేళా నందు తక్షణ రిజిస్ట్రేషన్ సౌకర్యం కలదన్నారు. మరింత సమాచారం కోసం 7207218883, 9949326722, 9640695229, 9032384374నైపుణ్య కమాండ్ కంట్రోల్ నంబర్లు:9988853335,8712655686,8790118349 సంప్రదించాలన్నారు. స్పాట్ రిజిస్ట్రేషన్ కోసం ఆధార్ కు అనుసంధానమైన మొబైల్ నెంబర్ తప్పనిసరి అన్నారు.

# పెదకాకానిలో ఐదుగురు అర్చకులు సస్పెండ్..

ప్రజాదివాస్



గుంటూరు జిల్లా,పెదకాకాని శ్రీ మల్లేశ్వర స్వామి దేవస్థానంలో భ్రమరాంబ అమ్మవారి బంగారు మంగళసూత్రాలు అదృశ్యమైన ఘటనలో బాధ్యతారాహిత్యం, విధి నిర్వహణలో నిర్లక్ష్యానికి ఐదుగురు అర్చకులను సస్పెండ్ చేశారు.! ఉప ప్రధాన అర్చకుడు జాలయ్య తో పాటు విజయ్ ప్రతాప్, విశ్వనాథ్, గాయత్రి మణికణ్ణశాస్త్రి, కాంట్రాక్ట్ అర్చకులు గర్నెపూడి గిరికుమార్లపై సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆలయ ఈవో లీలాకుమార్ బుధవారం మీడియాకు తెలిపారు...